

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 26-11-2022 సంపుటి : 04 సంచిక :85 పేజీలు : 4 వెల : రూ 3-00

## రాజమండ్రిలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి సీఎం జగన్ గ్రీన్‌సిగ్నల్



తాడేపల్లి: పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాలు, పట్టణాల్లో కనీస మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ, సమస్యలపై సత్వర పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీర్ఘకాలంలో నిర్మాణాత్మక వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. దీనికోసం పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నది. ఏపీ సీఎం ఎంఎస్ (ఏపీ కన్‌సిస్టెంట్ మానిటరింగ్ ఆఫ్ మున్సిపల్ సర్వీసెస్) యాప్‌తో రియల్‌టైం మానిటరింగ్ చేయనున్నారు. రోడ్లపై గుంతలు, రోడ్లకు మరమ్మతులు, పచ్చదనం, సుందరీకరణ, వీధిలైట్ల నిర్వహణ, ఫుట్‌పాత్స్, మురుగు కాల్వల్లో పూడిక తొలగింపు, భూగర్భ మురుగునీటి వ్యవస్థల నిర్వహణ, పబ్లిక్ టాయ్‌లెట్ల ఏర్పాటు, వాటి నిర్వహణ, ట్రాఫిక్ జంక్షన్లు, వాటి నిర్వహణ అంశాలపై యాప్ ద్వారా రియల్ టైం మానిటరింగ్ చేయనున్నారు. దీనికి సంబంధించిన యాప్ మరో నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. ఈ యాప్ ద్వారా రాష్ట్రంలోని 4,119 వార్డు సచివాలయాల పరిధిలో ఈ మౌలికసదుపాయాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ. వార్డు సెక్రటరీలు తమ పరిధిలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి 12 గంటలవరకూ తనిఖీలు. తమ పరిధిలోని సుమారు 6-7 కి.మీ. మేరరోడ్లపై నిరంతర పర్యవేక్షణతోపాటు, పైన పేర్కొన్న వాటిపై నిరంతర తనిఖీలు. ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే ఫొటో తీసి యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు పౌరులకూ ఫోటోలు అప్‌లోడ్ చేసే అవకాశం ఉంటుంది. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కూడా తమ దృష్టికి వచ్చిన అంశాలను యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించారు.

ఎప్పటికప్పుడు ఈ సమస్యలు సంబంధిత విభాగాలకు చేరి అక్కడనుంచి పరిష్కారం అవుతాయి. నివేదించిన ప్రతి సమస్య పరిష్కారంపైనా మానిటరింగ్ జరుగుతుంది. సీఎం వైఎస్ జగన్ ఏమన్నారంటే.. మున్సిపల్ సర్వీసుల కోసం నగరాలు, పట్టణాల్లో తీసుకు వస్తున్న యాప్‌ను గ్రామాల్లోకూడా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశం. నగరాల్లో, పట్టణాల్లో రోడ్లు, మురుగునీటి కాల్వలు సహా ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణ బాగుండాలన్నారు. ఇప్పుడు తీసుకొస్తున్న యాప్ ద్వారా వచ్చే గ్రీవెన్స్‌ను పరిష్కరించే వ్యవస్థ బలోపేతంగా ఉండాలన్నారు. వర్షాకాలం సహా అన్ని కాలాల్లోనూ బాగుండేలా రోడ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీ అంశంపైనాకూడా దృష్టిపెట్టాలని ఆదేశించారు. మున్సిపల్ సర్వీసులు పారదర్శకంగా ప్రజలకు అందాలి. టౌన్ ప్లానింగ్ సహా ఇతరత్రా విభాగాల్లో సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌ను పరిశీలన చేయాలి. ప్రజలకు సత్వరంగా సేవలు అందడం, నిర్దేశిత సమయంలోగా అనుమతులు రావడం, అవినీతి లేకుండా చూడటమే లక్ష్యంగా మార్పులు తీసుకురావాలి. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై నిశిత సమీక్షచేసి తగిన ప్రణాళికను రూపొందించాలి. రాజమండ్రిలోనూ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటు నిర్మాణ ప్రతిపాదనకు సీఎం వైఎస్ జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 28 అర్బన్ లోకల్ బాడీస్‌ను కవర్ చేస్తూ ప్లాంట్ నిర్మాణం జరుగనుంది. 7.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్. ఈ సమీక్షా సమావేశంలో పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై. శ్రీలక్ష్మి, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ డాక్టర్ పి సంపత్ కుమార్, ఏపీజీబీసీఎల్ ఎండీ బి రాజశేఖరరెడ్డి, మెప్మా ఎండీ విజయలక్ష్మి ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## 'వీరంతా సిండికేట్‌గా ఏర్పడి ఆక్వా రంగాన్ని పాడు చేశారు'



శ్రీకాకుళం: చంద్రబాబుకు పెట్టుబడి పెట్టే పెట్టుబడిదార్లు ఆక్వా రంగంలో స్థిర పడ్డారని, వీరంతా ఒక సిండికేట్‌గా ఏర్పడి వ్యవస్థను పాడు చేశారని మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. చంద్రబాబు వదిలి వెళ్లిపోయిన రూ. 330 కోట్ల బకాయిలను సైతం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిందన్నారు. శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహించిన మంత్రి అప్పలరాజు.. 'వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడ్డాక ఆక్వారంగానికి 2వేల ఆరువందల కోట్ల రూపాయిలు పవర్ సబ్సిడీ చెల్లించాం. సీఎం జగన్ తన పాదయాత్రలో యూనిట్ విద్యుత్ రూపాయిన్నరకు ఇస్తామన్న తర్వాత, చంద్రబాబు రెండు రూపాయిలు అని ప్రకటించి ఒక్క రూపాయి కూడా డబ్బులు ఇవ్వలేదు. ఆక్వా రైతులను ఆదుకుంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు. చంద్రబాబు పరిపాలన కాలంలో రూపాయి న్నరకు విద్యుత్ ఎందుకు ఇవ్వలేదు. ఆక్వా ప్రాసెస్, సీడ్ మిల్లర్‌లు వద్ద డబ్బులు వసూలు చేస్తున్నామని అంటున్నారు.. దీనికి సంబంధించి ఒక్కరితోనైనా మాట్లాడించగలరా. చంద్రబాబుకు పెట్టుబడి పెట్టే పెట్టుబడి దార్లు ఆక్వారంగంలో స్థిరపడ్డారు. వీరంతా ఒక సిండికేట్‌గా ఏర్పడి వ్యవస్థను పాడుచేసారు. ఆక్వారంగంలో మాఫియా ను సీఎం జగన్ అడ్డుకోకపోతే ఈ రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఆక్వారంగం కుదేలు అయిపోయేది. ప్రపంచంలో ఆర్థిక మాంద్యం, ప్రపంచ మార్కెట్ ధరల నేపథ్యంలో ఎగుమతులు తగ్గాయి. ప్రతికూల పరిస్థితుల్లో సీఎంజగన్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడింది. ఆక్వా ఎగుమతిదార్లకు ఎదరువతున్న సమస్యలు పరిష్కారానికి కమిటీ వేసి సమీక్ష చేస్తున్నాం. ఆక్వా రంగంలో సంస్కరణలు తెచ్చి చట్టాలు చేశాం. చంద్రబాబు పాలనలో ఆక్వారంగం స్టేక్ హోల్డర్స్ తో ఎప్పుడైనా మాట్లాడారా' అని ప్రశ్నించారు.

## మరో ప్రయోగానికి ఇస్రో రెడీ

నెల్లూరు, నవంబర్ 25 (న్యూస్ పల్స్)భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో కీలక ప్రయోగానికి సిద్ధమయింది. శనివారం (నవంబరు 26)న ఉదయం 11.56 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఖూబఒ-అ54/ఇూా-06 ప్రయోగాన్ని చేపట్టనుంది. దీనికి సంబంధించిన అనుసంధాన ప్రక్రియను రెండు రోజుల క్రితం చేపట్టిన శాస్త్రవేత్తలు తాజాగా రిహార్సల్స్ ను విజయవంతంగా పూర్తి చేశారు. కాగా ఈ ఉదయం 10.26 నిమిషాలకి రాకెట్ ప్రయోగానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ పేర్కొన్నారు. శనివారం సరిగ్గా 11.56 గంటలకు రాకెట్ ప్రయోగం చేయనున్నట్టు ఆయన తెలిపారు. పీఎస్ఎల్వీ సీ-54 రాకెట్ ద్వారా 9 ఉపగ్రహాలను నింగిలోకి పంపుతున్నామన్నారు.

## రాయలసీమకు కొత్తగా 9 జాతీయ రహదారులు

రూ.9,009 కోట్లు కేటాయింపు.. 411 కిలోమీటర్ల మేర నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం

రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధికి ఊతం

28న భూమిపూజ చేయనున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



అమరావతి: రాష్ట్రంలో మరిన్ని జాతీయ రహదారుల అభివృద్ధికి ముందడుగు పడింది. రాష్ట్రంలో కొత్తగా 9 జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ ఆమోదం తెలిపింది. వీటికి ఏకంగా రూ. 9,009 కోట్లు కేటాయించింది. మొత్తం 411 కిలోమీటర్ల నిడివి ఉన్న ఈ రహదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను యథాతథంగా ఆమోదించింది. రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ రహదారులను ప్రతిపాదించింది. పొడవైన తీరప్రాంతం ఉన్న రాష్ట్రాన్ని పోర్టు ఆధారిత పరిశ్రమలతో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గతంలో రెండుసార్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై జాతీయ రహదారులపై ప్రతిపాదనలను సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రభుత్వం వాటిని ఆమోదించింది. తొలి దశలో గత ఏడాది కేంద్ర మంత్రి గడ్కరీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ. 15 వేల కోట్లతో నిర్మించనున్న జాతీయ రహదారులకు విజయవాడలో భూమి పూజ చేశారు. రెండో దశ కింద రాయలసీమలో జాతీయ రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ మేరకు కొత్తగా 9 రహదారులతో పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. వీటికి కేంద్ర రవాణా, జాతీయ రహదారుల అభివృద్ధి శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 28న తిరుపతిలో భూమిపూజ చేయనున్నారు. ఇప్పటికే రూ. 204 కోట్లతో 19 కిలోమీటర్ల మేర నిర్మించిన రెండు జాతీయ రహదారులను ఆయన ప్రారంభిస్తారు. కేంద్ర మంత్రి గడ్కరీ ఈ నెల 27, 28 తేదీల్లో తిరుపతిలో పర్యటిస్తారు. ఆయన 27వ తేదీ రాత్రికి తిరుమల చేరుకుని తెల్లవారుజామున శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొంటారు. అనంతరం 28న తిరుపతిలో నిర్వహించే కార్యక్రమంలో, జాతీయ రహదారుల భూమిపూజలో పాల్గొంటారు.

## బడ్జెట్‌పై నిర్మలా సీతారామన్ సమావేశం.. హాజరైన ఆర్థిక మంత్రి బుగ్గన



ఢిల్లీ: వచ్చే ఏడాది ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై కేంద్రం కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా రామన్ ఢిల్లీలో ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, కార్యదర్శులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఈ భేటీలో పాల్గొన్నారు. విభజన చట్టంలోని పెండింగ్ అంశాలు సహా అభివృద్ధి పథకాలకు నిధులు వంటి అంశాలను లేవనెత్తారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రులు రానున్న బడ్జెట్‌లో ఆయా రాష్ట్రాల ప్రాధాన్యాలను కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించారు.

## యాంకరేజి పోర్టులో మంత్రి అమర్నాథ్ శంకుస్థాపనలు

కాకినాడ: కార్గో ఎగుమతుల వార్షిక సామర్థ్యాన్ని 3 మిలియన్ టన్నులకు పెంచేందుకు సాగరమాల కార్యక్రమం కింద రూ. 91 కోట్లతో మంజూరు చేసిన కాకినాడ యాంకరేజి పోర్టు అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రాజా, వేణుగోపాలకృష్ణ, ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కురసాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పోర్టులో రెండు మెకానికల్ కార్గో హ్యాండ్లింగ్ వార్ఫులు, న్యూ పోర్టు ఏరియాలో 5 అదనపు లోడింగ్ పాయింట్ల నిర్మాణం, పోర్టు అనుబంధ, అంతర్గత రహదారుల అభివృద్ధి, కమర్షియల్ కెనాల్ గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల మరమ్మతులు, కమర్షియల్, అప్రోచ్ కెనాల్ డ్రెడ్జింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు చేసేందుకు హైదరాబాద్‌ఉ చెందిన విశ్వసముద్ర హోల్డింగ్స్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఏడాది కాలంలో ఈ పనులు పూర్తి చేయనున్నారు.

## అవును.. తెలంగాణ సిట్ నోటీసులు అందాయి: రఘురామ



ఢిల్లీ: 'తెరాస ఎమ్మెల్యేలకు ఎర' కేసులో తనకు తెలంగాణ సిట్ నోటీసులు అందాయని వైకాపా ఎంపీ రఘురామకృష్ణ రాజు తెలిపారు. ఢిల్లీలోని తన నివాసంలో సిట్ నోటీసులు అందజేశారని ఆయన పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఈనెల 29న బంజారాహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని సూచించినట్లు చెప్పారు. దర్యాప్తులో భాగంగా ఎంపీ రఘురామకు సంబంధించిన పలు కీలక విషయాలను సిట్ సేకరించినట్లు తెలుస్తోంది.. ఈ క్రమంలోనే ఆయనకు 41ఏ సీఆర్‌పీసీ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో రామచంద్రభారతి, సింహయాజి, నందకుమార్‌లు నిందితులుగా ఉండగా.. భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కేరళ వైద్యుడు డా.జగ్గుస్వామి, బీడీజేఎస్ నేత తుషార్, కరీంనగర్ న్యాయవాది బూసారపు శ్రీనివాస్‌లను నిందితుల జాబితాలో సిట్ కొత్తగా చేర్చింది.

## జడ్జిల బదిలీ ప్రతిపాదన.. వివక్షకు సంకేతం: హైకోర్టు న్యాయవాదుల ఆందోళన



అమరావతి: ఏపీ హైకోర్టుకు చెందిన న్యాయమూర్తుల బదిలీలను నిరసిస్తూ న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నుంచి న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ డి.రమేశ్ బదిలీ సరికాదన్నారు. ఈ మేరకు హైకోర్టులో విధులు బహిష్కరించి న్యాయవాదులు నిరసన తెలిపారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల బదిలీ ప్రతిపాదన వివక్షకు సంకేతమని ఆరోపించారు. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి బదిలీని వెనక్కి తీసుకున్నారని చెప్పారు. వివిధ హైకోర్టుల నుంచి ఏడుగురు న్యాయమూర్తులను ఇతర హైకోర్టులకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం గురువారం సిఫార్సు చేసింది. ఇందులో తెలంగాణ హైకోర్టు నుంచి ముగ్గురు, ఆంధ్రప్రదేశ్, మద్రాస్ హైకోర్టుల నుంచి ఇద్దరి చొప్పున న్యాయమూర్తులున్నారు. తెలంగాణ హైకోర్టు నుంచి జస్టిస్ కన్నెగంటి లలితను కర్ణాటక హైకోర్టుకు, జస్టిస్ డాక్టర్ డి.నాగార్జునను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ ఏ.అభిషేక్‌రెడ్డిని పట్నా హైకోర్టుకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నుంచి జస్టిస్ బట్టు దేవానంద్‌ను మద్రాస్ హైకోర్టుకు, జస్టిస్ డి.రమేష్‌ను అలహాబాద్ హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు నుంచి జస్టిస్ వి.ఎం.వేలుమణిని కలకత్తా హైకోర్టుకు, జస్టిస్ టి.రాజాను రాజస్థాన్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే.



# సంపాదకీయం

శనివారం 26-11-2022

## అప్పులు దొరకకపోతే జీతాలు కష్టమేనా

తెలుగు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి రాను రాను దిగజారిపోతోంది. ఏపీ అప్పులు చేసి మిణుకుమిణుకుమంటూడగా.. తెలంగాణకు అప్పలు దొరకక ఆ పరిస్థితి ఎదుర్కొంటోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు అప్పులు.. వడ్డీల భారం అధికంగానే ఉంది. వచ్చే ఆదాయంలో అత్యధికం వడ్డీలకే కేటాయించాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో కేంద్రంతో మంచి సంబంధాలు నెలకొల్పుకుని .. ఎలాగోలా అప్పులు తెచ్చుకుని బయటపడాలని ఏపీ ప్రయత్నిస్తూండగా...తెలంగాణ సీఎం కేసీఆర్ మాత్రం.. కేంద్రంతో ఢీ అంటేఢీ అనడానికి రెడీ అవుతున్నారు. తాడోపేడో తేల్చుకుంటానంటున్నారు. తెలుగు రాష్ట్రాల ఖజానాకు వస్తున్న ఆదాయంలో అధికభాగం చేసిన అప్పులకు చెల్లించాల్సిన వడ్డీలకే సరిపోతోంది ఏడాదికి ఏడాదీ వడ్డీల భారం పెరిగిపోతుండడంతో ఇతర కార్యక్రమాలకు నిధులు చాలడం లేదు. రిజర్వ్‌బ్యాంకు ప్రకటించిన గణాంకాల ప్రకారం చూస్తే ఏపీ రాష్ట్ర ఆదాయంలో అత్యధికభాగం వడ్డీలకు చెల్లించాల్సివస్తోంది. గత ఆరేళ్లలో వడ్డీలకు చెల్లించే మొత్తం రెట్టింపుకన్నా ఎక్కువగా రికార్డయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 22,740 కోట్ల రూపాయలను ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వడ్డీగా చెల్లించాల్సి వస్తోంది. తెలంగాణ రాష్ట్ర వడ్డీల భారతం ఏపీతో పోలిస్తే కాస్త తక్కువే. తెలంగాణ రూ. 17,584 కోట్ల రూపాయలను ఈ ఆర్థిక సంవత్సరంలో వడ్డీలుగా కట్టాల్సి వస్తోంది. రాష్ట్రాలు అవసరాల కోసం తీసుకునే అప్పుల్లో ఎక్కువ శాతం సెక్యూరిటీ బ్యాండ్లను తనఖా పెట్టడం ద్వారా బహిరంగ మార్కెట్ రుణాల నుంచి తీసుకుంటుండగా, విద్యుత్ బ్యాండ్లు, వేస్ అండ్ మీన్స్, నాబార్డ్ రుణాలు, జాతీయ సహకారాభివృద్ధి సంస్థ నుంచి, ఇతర బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలు ఉంటాయి. వీటిపై ప్రతి నెలా తప్పనిసరిగా వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. కార్పొరేషన్ల పేరుతో గ్యారంటీలు ఇచ్చి బ్యాంకులు.. ఇతర ఆర్థిక సంస్థల నుంచి అప్పులు చేయడం ఇటీవలి కాలంలో బాగా పెరిగిపోయింది. ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే గ్యారంటీల్లో తొలి స్థానంలో తెలంగాణ ఉండగా.. మూడో స్థానంలో ఏపీ ఉంది. దేశం మొత్తంమీద అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి ఇచ్చిన గ్యారంటీల్లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలదే 64 శాతం . సొంత పన్నుల ఆదాయంలో 90 శాతం వరకు గ్యారంటీలు ఇచ్చుకోవచ్చునన్నది నిబంధన కాగా, గతేడాది దీనిని 180 శాతంగా పెంచుతూ ఏపీ సొంత నిర్ణయం తీసుకుంది. గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీల విలువ ఏకంగా రూ. 91,330 కోట్లుగా ఉంది. తెలంగాణ రూ. 1,05,006 కోట్లు రుణాలకు గ్యారంటీ ఇచ్చింది. సెప్టెంబర్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ 21, 173 కోట్ల రూపాయల అప్పు చేసింది. నిజానికి కేంద్రం అప్పులపై పూర్తి స్థాయిలో ఆంక్షలు విధించడం వల్లనే ఈ కొద్ది లోన్లు. లేకపోతే.. మరో ముప్పై వేల కోట్ల రుణం అదనంగా తీసుకునేవారు. గతంలో మంజూరైన కాళేశ్వరం రుణాలు కూడా ప్రస్తుతం ఆగిపోయాయి. అందుకే కేసీఆర్ కేంద్రంపై మండి పడుతున్నారు. కేంద్రం తీరు వల్ల 40వేలకోట్లు రావడం లేదని అంటున్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టాలనుకుంటున్నారు. ఏపీలో అయితే.. . ఆరు నెలల్లో దగ్గర దగ్గర యాభై వేల కోట్లు అప్పు చేసింది. కేంద్రం.. ఏపీ విషయంలో ఎలాంటి ఆంక్షలు పెట్టలేదు. ఏడాది మొత్తం 48వేల కోట్ల అప్పు చేస్తామని బడ్జెట్‌లో ఏపీ పెడితే.. ఆరు నెలలకే 49వేల కోట్ల అప్పు చేసింది. ఇంకా అదనపు అప్పుల కోసం కేంద్రం వద్ద గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. వస్తున్న ఆదాయంలో ఎక్కువ భాగం వడ్డీలకు.. తప్పని సరి చెల్లింపులకు పోతూండటంతో ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి కూడా ప్రభుత్వాలు తంటాలు పడుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఉద్యోగుల జీతాలు ఆలస్యమవుతున్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆర్బీఐ దగ్గర అప్పు తీసుకు వచ్చి సర్దుబాటు చేస్తున్నారు. కేంద్రం దయతలిచి అప్పులకు పర్మిషన్ ఇస్తే.. రెండు తెలుగు ప్రభుత్వాలూ .. ఇబ్బందుల నుంచి గట్టెక్కుతాయి. లేకపోతే.. ఆర్థిక సంక్షోభంలో ఇరుక్కుపోతాయి. ఏపీ ప్రభుత్వం కేంద్రంతో.. సన్నిహితంగా ఉంటుంది. అందుకే అప్పులు దొరుకుతాయన్న భరోసాతో ఉంది. కానీ తెలగామ సర్కార్ అలా లేదు. ఏం చేసినా కేంద్రం అప్పులకు పర్మిషన్ ఇవ్వదన్న ఉద్దేశంతో.. అసలు విషయాన్ని ప్రజల ముందు ఉంచాలని.. కేంద్రం వల్లే ప్రజలకు సమస్యలని చెప్పాలన్న ఉద్దేశంలో ఉన్నట్లుగా తెలుస్తోంది.

# వైసీపీలో టిక్కెట్ల టెన్షన్



విజయవాడ, నవంబర్ 25, వైసీపీలో జరిగిన మార్పులు మరోసారి ఏపీ రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. జిల్లా అధ్యక్షులు, రీజనల్ కోఆర్డినేటర్ పదవుల మార్పు ముందే ఊహించిందా? లేదంటే పార్టీ అధ్యక్షుడి హెచ్చరికల నేపథ్యంలో జరిగిందా? అన్నది ఆసక్తికరంగా మారింది. అంతేకాదు ఈ మార్పు ఎలాంటి సంకేతాలు ఇవ్వబోతోందన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. రాజకీయాల్లో బంధాలు, అనుబంధాలు అలాగే మిత్రులు, శత్రువులు అనే మాటలు ఉండవన్న విషయం మరోసారి వైసీపీ నిరూపించింది. జిల్లా అధ్యక్షులు, రీజనల్ కోఆర్డినేటర్ పదవుల విషయంలో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ తీసుకున్న నిర్ణయాలే ఇందుకు ఉదాహరణగా నిలిచాయి. ఎవరూ ఊహించని విధంగా ఈ మార్పులు జరగడం ఆపార్టీ నేతలనే కాదు రాజకీయవర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఏ కోణంలో జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారన్నది చర్చనీయాశంగా మారింది. గత ఎన్నికల్లో 151 సీట్లు సాధించిన వైసీపీ ఈసారి ఏపీలో అన్ని స్థానాలను అంటే 175 సీట్లను కైవసం చేసుకొని ప్రతిపక్షం లేకుండా చేయాలన్నది ఆపార్టీ అధినేత లక్ష్యం. ఈ విషయాన్ని ఎప్పుడో పార్టీ నేతలకు స్పష్టం కూడా చేశారు. అందులో భాగంగానే ఇంటింటికి మన ప్రభుత్వం పేరుతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మంత్రులు, పార్టీ నేతలందరినీ ప్రజల మధ్యలో ఉండేలా చేస్తున్నారు. అయితే జగన్ ఆశించిన స్థాయిలో పార్టీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం లేదు. వివిధ కారణాలతో తప్పించుకోవడం లేదంటే కుటుంబసభ్యులతో మమ అనిపించడం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వైసీపీ అధినేత జగన్ పార్టీ మీటింగ్ లో ఈ తరహా వ్యవహారాలు తన దగ్గర కుదరదని స్పష్టం చేయడమే కాదు పనిచేసే వారికే పార్టీలో పదవులు ఉంటాయని ప్రకటించారు. అంతేకాదు ప్రజల మద్దతు ఉన్నవారికే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఉంటుందని స్పష్టం చేశారు. అలా పనిచేయని వారిలో మంత్రులు కూడా ఉన్నారు. వారిని సైతం హెచ్చరించారు. అయితే జగన్ మాటలను పార్టీ శ్రేణులు సీరియస్ గా తీసుకోలేదు. జిల్లాలో ఆధిపత్యం కోసం పోరు, కిందిస్థాయి నేతలతో సమన్వయం లేకపోవడం, కార్యకర్తలకు దూరంగా ఉండటం , ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించలేకపోవడం వంటి పలు విషయాలను జగన్ పరిగణలోనికి తీసుకున్నారు. ఫలితంగానే ఈ మార్పులు అని ఇన్ సైడ్ టాక్. మాజీ మంత్రులు అనిల్, సుచరితలతో పాటు పలువురు కీలక నేతలకు సైతం జగన్ షాకివ్వడంతో పార్టీ శ్రేణుల్లో టెన్షన్ నెలకొంది. త్వరలోనే మళ్లీ క్యాడర్ తో జగన్ సమావేశం నిర్వహించబోతున్నారు. ఈ లోపు నేతల్లో మార్పు వస్తే సరే లేదంటే ఇక దూరం పెట్టేసే ఆలోచనలో ఉన్నారట. ఎన్నికలకు ఆరు నెలల ముందే అభ్యర్థిని ప్రకటిస్తానని ఇంతకుముందే స్పష్టం చేసిన జగన్ ఇప్పుడు ఆ మాటకే కట్టుబడి ఉన్నారట. అందులో భాగంగానే ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారని టాక్. పార్టీ శ్రేణుల పనితీరుపై వచ్చిన సర్వేల ఆధారంగానే వైసీపీ అధినేత జగన్ ఈ మార్పులకు శ్రీకారం చుట్టారని తెలుస్తోంది.

# వైసీపీకి కలిసొచ్చిన ఇప్పటం

గుంటూరు, నవంబర్ 25,అప్పుడూ అధికారపార్టీకే న్యాయస్థానాల నుంచి చీవాట్లు... ఇప్పుడు విపక్షాలకు పరోక్షంగా మొట్టికాయలు పడ్డాయన్నట్లు ఉంది ఇప్పటం ఇష్యు. ఎన్నాళ్లనుంచో ఒక మంచి కబురు న్యాయస్థానాలనుంచి అధికారపార్టీకి అందింది. ఇప్పటం కూల్చివేతలపై నానా హంగమా చేసిన విపక్షాలకు ఒక్క తీర్పుతో చెక్ పడినట్లయింది. గత కొన్నిరోజులుగా ఏపీలో రాజకీయదుమారానికి కారణమైన ఇప్పటం మరోసారి వార్తల్లో నిలిచింది. హైకోర్టు తీర్పుతో ఈ వివాదం ఇక సద్దుమణిగినట్టేనా? ఈ తీర్పుతో ఎవరికి లాభం.. ఎవరికి నష్టం ? ఇప్పటం కూల్చివేతలపై ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికారపార్టీకి ఊరట నిచ్చింది. తప్పుడు సమాచారం ఇచ్చి కోర్టుని తప్పుదోవ పట్టించినందుకు గానూ పిటీషనర్లకి రూ.లక్ష చొప్పున జరిమాన విధించి షాకిచ్చింది. అంతేకాదు కోర్టు ముందుకు హాజరుకావాల్సిందేనని ఆదేశించింది. ప్రభుత్వం నోటీసులు ఇచ్చినా ఇవ్వలేదని 14మంది పిటీషనర్లు హైకోర్టుని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ఈ షాకింగ్ తీర్పు ఇవ్వడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఏపీలో జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజల్లో కన్నా విపక్షాల నుంచే ఎక్కువగా వ్యతిరేకత వస్తోందన్న టాక్ ఉంది. పథకాల నుంచి జీవోల వరకు జగన్ ఏది అమలు చేసినా ప్రతిపక్షాలు అడ్డుకోవడం పరిపాటిగా మారిందని అధికారపార్టీ విమర్శలు చేస్తూ ఉంది.అలా ఈ మధ్యకాలంలో అధికార-విపక్షాల మధ్య నలిగిన అంశం ఇప్పటం. రోడ్ల విస్తరణలో భాగంగా ఇప్పటం ఊరిలో కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. ఇదే విపక్షాలకు ఆయుధంగా మారింది. ఈ కూల్చివేతలను నిరసిస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటం గ్రామాన్ని సందర్శించి బాధితులకు అండగా నిలిచారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థికసాయం అందించడమే కాదు త్వరలో జగన్ ప్రభుత్వం కూడా ఇలానే కూలిపోతుందని శాపనార్థాలు పెట్టారు. ఆ తర్వాత రెండు రోజులకే టీడీపీ యువనేత నారాలోకేష్ కూడా వెళ్లారు. మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యీగా బాదుడే బాదుడు కార్యక్రమంలో భాగంగా ఇప్పటంలో పర్యటించడమే కాదు జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అసలు ఈ నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్కే ఎక్కడని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పటం రోడ్ల విస్తరణపై విచారణ జరిపించడమే కాదు బాధితులను ఆదుకుంటామని స్పష్టం చేశారు.బీజేపీ కూడా ఇప్పటం రోడ్ల విస్తరణపై తనదైన స్టైల్లో స్పందించింది. ఇలా విపక్షాలన్నీ జగన్ సర్కార్ తీరుని తప్పుబడుతూ పార్టీలకతీతంగా అందరూ ఒక్కటై వైసీపీ సర్కార్ ని కూల్చాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు హైకోర్టు తీర్పుతో ఇప్పటం వివాదం ఓ కొలిక్కి వచ్చినట్లైందన్న టాక్ వినిపిస్తోంది. నోటీసులు ఇవ్వడమే కాకుండా రోడ్లని కబ్జా చేసి కట్టిన ప్రహరీగోడలను మాత్రమే కూల్చామని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అందుకు సంబంధించిన పలు ఫోటోలను మీడియా ముందు ఉంచింది. అయినా కానీ విపక్షాలు ఈ మాటల్లో నిజం లేదని చెబుతూ ఆరోపణలు చేసింది. అయితే ఇప్పుడు హైకోర్టు తీర్పుతో నిజానిజాలేంటో బయటపడ్డాయని అధికారపార్టీ చెబుతోంది. ప్రజలను తప్పుదోవపట్టించేందుకు విపక్షాలు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నా జగన్ ప్రభుత్వం వాటిని ఎదుర్కొంటూ అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తోందంటున్నారు. ఏది ఎలా ఉన్నా కానీ హైకోర్టు తీర్పు పిటీషనర్లకే కాదు విపక్షాలకు కూడా గట్టి షాక్ ను ఇచ్చాయని వైసీపీ నేతలు అంటున్నారు.

# ఏపీకి కాంగ్రెస్ కి జవసత్వాలు వచ్చేనా

విజయవాడ, నవంబర్ 25, ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పతనం నుంచి పతనానికి ప్రయాణం సాగిస్తోంది.?రాష్ట్ర విభజన ముందు వరకూ ఏపీలో కాంగ్రెస్ బలమైన పార్టీ. కానీ ఎప్పుడైతే రాష్ట్ర విభజన జరిగిందో అప్పటి నుంచీ రాష్ట్రంలో పార్టీ ఆనవాలు వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లయినా రాష్ట్రంలో కాంగ్రెస్ ను పట్టించుకునే నాథుడే లేని పరిస్థితి ఉంది. దేశంలో చాలా రాష్ట్రాలలో కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉంది. సమీప భవిష్యత్ లో పుంజుకోగలదా అన్న అనుమానాలూ వ్యక్తమౌతున్నాయి. అయినా ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్ కు బలమైన క్యాడర్ ఉంది. అది ఎక్కడా చెక్కు చెదరలేదు. క్యాడర్ కు దిశా నిర్దేశం చేసే నాయకులు కరవయ్యారే కానీ.. ఇప్పటికీ దేశంలో ఒక్క ఏపీ మినహా అన్ని రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ కు బలమైన క్యాడర్ ఉందనడంలో సందేహం లేదు. కానీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే గ్రాండ్ ఓల్డ్ పార్టీకి నాయకులు, క్యాడరూ కూడా లేని పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారిపోయి చాలా కాలమే అయ్యింది. హై కమాండ్ కూడా ఏపీలో పార్టీ పుంజుకోవడంపై ఎలాంటి ఆశలూ పెట్టుకోలేదని తాజాగా ప్రకటించిన కమిటీని చూస్తే ఇట్టే అర్ధమైపోతుంది. ఇప్పటి వరకూ పీసీసీ చీఫ్ గా ఉన్న సాకే శైలజానాథ్ పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో గిడుగు రుద్రరాజును నియమించింది. నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులను మస్తాన్ వలి, జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, రాకేష్ రెడ్డిలూ ఉన్నారు. అలాగే ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ గా పళ్లం రాజు, ప్రచార కమిటీ చైర్మన్ గా జీవీ హర్షకుమార్, మీడియా, సోషల్ మీడియా కమిటీ చైర్మన్ గా తులసి రెడ్డి నియమితులయ్యారు. 18మందితో రాజకీయ వ్యవహారాల కమిటీ, 33 మందితో కోఆర్డినేషన్ కమిటీని నియమించారు.ఇప్పటి వరకూ ఏపీసీసీ చీఫ్ గా ఉన్న సాకే శైలజానాథ్ తన పదవీ కాలం మొత్తంలో రాష్ట్రంలో పార్టీ పుంజుకోవడంపై దృష్టి సారించిన సందర్భాలు పెద్దగా లేవనే చెప్పాలి. ఎప్పుడు పదవీ కాలం పూర్తవుతుందా.. బాధ్యతల నుంచి తప్పుకుందామా అని ఎదురు చూసినట్లుగానే ఆయన వైఖరి ఉంది. ఏపీసీసీ చీఫ్ గా సాకే ఎంత నిర్లిప్తంగా పదవీ బాధ్యతలు నిర్వర్తించినా.. ఆయనకు పార్టీలో ఒక గుర్తింపు ఉంది. ఎమ్మెల్యేగా గెలిచిన చరిత్ర ఉంది. శింగనమల నియోజకవర్గం నుంచి వరుసగా రెండు సార్లు 2004, 2009 ఎన్నికలలో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైఎస్ హయాంలో మంత్రిగా పని చేశారు. అసెంబ్లీలో బలంగా గొంతు వినిపించారు. సాకే శైలజానాథ్ కు ముందు ఏపీ పీసీసీ చీఫ్ గా రఘువీరారెడ్డి ఉన్నారు. ఆయన కూడా క్షేత్రస్థాయిలో తనను తాను రుజువు చేసుకుని ఆ పదవి దక్కించుకున్నారు. 1985లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన రఘువీరారెడ్డి 1989లో మడకశిర నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున శాసనసభ్యుడిగా ఎన్నికయ్యాడు. కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. ఆ తరువాత 1994 శాసనసభ ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. 1999, 2004 ఎన్నికలలో వరుసగా రెండు సార్లు విజయం సాధించారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో వ్యవసాయ శాఖా మంత్రిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో కళ్యాణదుర్గం నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో మళ్లీ వ్యవసాయ శాఖా మంత్రిగా పనిచేశాడు. వై.ఎస్ మృతి తర్వాత కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో రెవిన్యూ శాఖా మంత్రిగా పనిచేశాడు. అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి మంత్రి వర్గంలో కూడా రెవిన్యూ శాఖా మంత్రిగా కొనసాగారు. రాష్ట్ర విభజన అనంతరం ఆ పదవిని చేపట్టిన రఘువీరారెడ్డి.. అప్పుడున్న అంతటిప్రతికూలపరిస్థితుల్లో సైతం రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించారు. చివరికి 2019 ఎన్నికలలో పార్టీ పరాజయానికి బాధ్యత వహిస్తూ అప్పటి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాజీనామా చేసిన తరువాత రఘువీరారెడ్డి అదే బాటలో నడిచి పక్కకు తప్పుకున్నారు. ఆ తరువాత సాకే శైలజానాథ్.. కానీ సాకే శైలజానాథ్ వారసుడిగా కాంగ్రెస్ హై కమాండ్ ఎంపిక చేసిన కమిటీని చూస్తే ఏపీలో పార్టీ భవిష్యత్ పై ఆశలు వదిలేసుకుందా అని పించక మానదు.ఇక ఏఐసీసీ పగ్గాలు అందుకున్న గిడుగు రుద్రరాజు గతంలో ఎమ్మెల్సీగా పని చేశారు. అలాగే ఏఐసీసీ కార్యదర్శిగా ఒడిశా రాష్ట్ర సహాయ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. అయితే ప్రత్యక్ష ఎన్నికలలో ఎన్నడూ నిలవలేదు. అలాగే క్షేత్ర స్థాయిలో ప్రజలతో మమేకమై పని చేసిన సందర్భం కూడా లేదు. వైఎస్సార్, కెవీపీలకు సన్నిహితుడిగా మెలిగారని చెప్పుకుంటారు. అయితే ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవలసిన విషయమేమిటంటే.. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలన్న సంకల్పం నిజంగా పార్టీలో ఉంటే.. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలున్న నేతలకు పీసీసీ పగ్గాలు అప్పగించాలని, లేదని పరిశీలకులు అంటున్నారు.రాష్ట్ర విభజన తరువాత నుంచీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న సీనియర్లను మళ్లీ క్రియాశీలంగా చేసేందుకు ప్రయత్నాలు చేసి ఉండాల్సింది. అలా కాకుండా ఇప్పటికే ప్రజలతో సంబంధం కోల్పోయిన కాంగ్రెస్ కు అధ్యక్షుడిగా ప్రజలతో సంబంధాలు లేని నాయకుడిని నియమిస్తే ప్రయోజనం ఏమిటన్న ప్రశ్న కాంగ్రెస్ శ్రేణుల్లోనే వినిపిస్తోంది. ఇలా ఉంటే.. తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు అధిష్ఠానానికి కృతజ్ఞతలు చెప్పిన గిడుగు అధిష్ఠానం నమ్మకాన్ని నిలుపుకుంటానని అన్నారు.

# పాపం వసంత

విజయవాడ, నవంబర్ 25, తండ్రి చేసిన కామెంట్స్ కు తనయుడు క్షమాపణలు చెప్పారు. వసంత నాగేశ్వరరావు వైసీపీ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు పార్టీలో సంచలనం కలిగించాయి. దీంతో వసంత కృష్ణప్రసాద్ రంగంలోకి దిగారు. తన తండ్రి చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని ఆయన వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కమ్మ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతుందని, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చినా ఎవరూ పట్టించుకోలేదని, మంత్రి వర్గంలో ఒక్క కమ్మ వారికీ స్థానం కల్పించలేదని వసంత నాగేశ్వరరావు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. పొరుగున ఉన్న తెలంగాణలో కమ్మ సామాజిక వర్గానికి మంత్రి పదవి కేటాయించడాన్ని ఆయన గుర్తు చేశారు. భారతీయ జనతా పార్టీకి సంబంధించినది కాదు ఆయన వ్యాఖ్యలతో... వసంత నాగేశ్వరరావు చేసిన ఈ వ్యాఖ్యలను ఆయన కుమారుడు వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఖండించారు. తన తండ్రి చేసిన వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని ఆయన పేర్కొన్నారు. అమరావతి రాజధాని విషయంలో జగన్ తీసుకున్న నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఇందులో తనకు ఎలాంటి అసంతృప్తి లేదన్నారు. జగన్ నిర్ణయమే తనకు శిరోధార్యమని వసంత కృష్ణ ప్రసాద్ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనకు టిక్కెట్ ఇచ్చినా, ఇవ్వకున్నా వైసీపీ విజయం కోసం తాను పనిచేస్తానని ఆయన చెప్పే ప్రయత్నం చేశారు. చంద్రబాబు పార్టీకి డ్యామేజీ జరిగిందని... వసంత నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలతో పార్టీకి డ్యామేజీ జరిగిందని హైకమాండ్ భావించింది. వసంత కృష్ణ ప్రసాద్ కు టిక్కెట్ ఇచ్చి మరీ ఎమ్మెల్యేను చేసింది ఎవరని వైసీపీ నేతలు కొందరు ప్రశ్నిస్తున్నారు. తొలి విడతలో కమ్మ సామాజికవర్గానికి చెందిన కొడాలి నానికి మంత్రి పదవి ఇచ్చామని, రెండున్నర సంవత్సరాల తర్వాత అందరినీ తొలగించినట్లుగానే ఆయనను కూడా తొలగించామని వైసీపీ అధిష్టానం చెబుతుంది. ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల వారికి పదవులు ఇవ్వడం కోసం కమ్మ, వైశ్య వంటి సామాజిక వర్గాలను పక్కన పెట్టిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. . తన తండ్రి చేసిన వ్యాఖ్యలు తన పొలిటికల్ కెరీర్ కు ఇబ్బంది కలిగించేవిగా ఉండటంతో వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ హైకమాండ్ ను కలిసే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అయితే ఆయనకు జగన్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని సమాచారం. తన తండ్రి ఆవేశంతో మాట్లాడిన మాటలను పరిగణనలోకి తీసుకోవద్దని వైసీపీ సీనియర్ నేతలకు ఆయన సూచించినట్లు చెబుతున్నారు. ఆయన కమ్మ సామాజికవర్గం నిర్వహించిన వనభోజనం కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి వస్తుందని భావించి, అది రాకపోవడంతోనే తన తండ్రి ఆవేశంతో ఆ వ్యాఖ్యలు చేశారని వసంత కృష్ణ ప్రసాద్ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. మైలవరంలో వచ్చే ఎన్నికల్లో తనకు టిక్కెట్ ఇచ్చినా, ఇవ్వకున్నా వైసీపీ వెంటే ఉంటానని, పార్టీ గెలుపునకు కృషి చేస్తానని ఆయన చెప్పినట్లు తెలిసింది.

# మఠాధిపతుల ఆగ్రహం...

తిరుమల, నవంబర్ 25, హిందూ ధర్మాన్ని కాపాడుతున్నామని ప్రచారం చేస్తున్న టీటీడీ అధికారులు హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా ప్రవర్తిస్తున్నారని తెలంగాణ రాష్ట్రం స్వప్నా నందుల ఆశ్రమం శ్రీశ్రీశ్రీ చంద్రమౌళీశ్వర స్వామి విమర్శించారు. తిరుమల శ్రీవారిపై జరుగుతున్న అపోహలను తెలుసుకోవడానికి సుమారుగా 40 మందిపైగా పీఠాధిపతులు, మఠాధిపతులు తిరుమల శ్రీవారి సన్నిధికి వచ్చారు. శ్రీవారి సన్నిధికి వెళ్ళకుండా అధికారులు అడ్డుకున్నారని, టీటీడీ ఈవో ఇతర కులానికి చెందిన వారిగా ఉన్నాడని తీవ్ర విమర్శ చేశారు శ్రీవారి దగ్గరికి వెళ్లాలంటే పీఠాధిపతులు కూడా డబ్బులు కట్టి టికెట్ తీసుకోవాలని అన్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో శ్రీవారికి నిలువునామం కూడా తీసివేసినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.హిందూ ధర్మాన్ని కాపాడుతున్నామని ప్రచారం చేసుకుంటున్న అధికారులు వారి మనోభావాలు దెబ్బ తినేలా ప్రవర్తిస్తున్నారని అన్నారు. టీటీడీ ఈవోపై, రాష్ట్ర ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. కులాలకు మతాలకు అతీతంగా అందర్నీ సమానంగా పీఠాధిపతులు, మఠాధిపతులు చూస్తారని, అలాంటి వారికే తీవ్ర అవమానం జరిగేలా టీటీడీ సిబ్బంది ప్రవర్తించారని అన్నారు. హిందూ ధార్మిక సంస్థలపై జరుగుతున్న దాడిపై, హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి, రాబోయే రోజుల్లో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ వారితో పీఠాధిపతులు, మఠాధిపతులు కలిసి లక్షలాది మంది హిందువులతో, హిందూ మహాసభను తిరుపతి నగరంలో నిర్వహించబోతున్నట్లుగా శ్రీశ్రీశ్రీ చంద్రమౌళీశ్వర స్వామి స్పష్టం చేశారు

# నకిలీ సబ్ కలెక్టర్ గుట్టురట్టు

విజయవాడ, నవంబర్ 25, కాసినో విలాసాలకు అలవాటుపడి డబ్బు కోసం అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ఉన్న ప్రభుత్వ ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాడు. కలెక్టర్నంటే దొరికిపోతాననుకున్నాడో ఏమో సబ్కలెక్టర్ని అంటూ కొత్త అవతారం ఎత్తాడు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అమాయక మహిళలకు టోకరా వేశాడు. లక్షల్లో కాజేశాడు. మరోసారి ఓ మహిళకు వల వేయబోయి అదే వలలో చిక్కుకున్నాడు ఈ కేటుగాడు. విజయవాడ చిట్టీనగర్ కు చెందిన పిల్లా వెంకట రాజేంద్ర అఖీఆం లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రజల అవసరాలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అక్రమాలకు తెరలేపాడు. ఈ క్రమంలో సబ్ కలెక్టర్ అవతారమెత్తాడు. పోలీసు ఉన్నతాధికారులతో తనకు మంచి పరిచయాలు ఉన్నాయని ప్రజలు నమ్మించాడు. ప్రభుత్వ ఉద్యోగాలు, కాంట్రాక్టు ఇప్పిస్తానని చెప్పి లక్షల రూపాయలు వసూలు చేశాడు ఈ కేటుగాడు.పలువురికి ప్రభుత్వ ఉద్యోగాలు ఎరగా వేసి దాదాపు 80 లక్షల వరకూ వసూలు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఇప్పిస్తానంటూ ఓ మహిళ వద్దనుంచి 9 లక్షల రూపాయలు వసూలు చేసాడంటే ఈ కేటుగాడి మాస్టర్ ప్లాన్ అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు భూ సెటిల్ మెంట్లు చేస్తానని డైరెక్ట్ ఫోన్లోనే డీల్ సెటిల్ చేసుకునేవాడు. సబ్ కలెక్టర్గా ఉన్న తాను త్వరలోనే ప్రమోషన్ మీద కలెక్టర్ని అవుతున్నానంటూ నమ్మబలికాడు. అంతేకాదు. తనకు జేపీ నడ్డా, శ్రీపతి నాయక్తో డైరెక్ట్ కనెక్షన్స్ ఉన్నాయని వారి రికమెండేషన్తో తనను సెంట్రల్ అథారిటీలో డైరెక్టర్గా వేస్తున్నారని చెప్పాడు.ఈ కేటుగాడి మోసాన్ని గ్రహించిన ఓ మహిళా బాధితురాలు తన డబ్బులు తిరిగి ఇమ్మని ఇంటికి వెళ్తే తనను బెదిరించాడని వాపోయింది. తనకు పెద్ద పెద్దవాళ్లు తెలుసని, నాపైన కేసు వేసినా రెండు రోజుల్లో తిరిగొస్తానని, మీరే నష్టపోతారంటూ బెదిరిస్తున్నాడని తెలిపింది. బాధితులో ఇంకా చాలామంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేసింది.తిరుమలలో సబ్కలెక్టర్ హోదాలో స్వామి దర్శనానికి వచ్చారని, అక్కడ పరిచయమైన ఆయన తాను సబ్ కలెక్టర్ రాజేంద్రనని, ఏదైనా అవసరముంటే ఫోన్ చేయాలంటూ తమవద్ద ఫోన్ నెంబర్లు తీసుకున్నారనితెలిపింది. నెల తర్వాత ఫోన్ చేసి సివిల్ సప్లైయ్సో కాంట్రాక్ట్ ఇప్పిస్తానని, తాను ప్రభుత్వఉద్యోగిన కనుక ఇందులో నావాళ్లు ఉంటే మంచిదంటూ తమ వద్దనుంచి 9 లక్షల రూపాయలు తీసుకున్నాడని తెలిపింది. ఎంతకీ కాంట్రాక్ట్ రాకపోయేసరికి నెలరోజుల తర్వాత ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం మానేసాడని వాపోయింది. అనుమానంతో ఎంక్వయిరీకి పంపిస్తే అతని అసలు విషయం బయటపడిందని తెలిపింది.

## మంత్రి కాకాణికి ఇబ్బందులు తప్పవా




నెల్లూరు, నవంబర్ 25, ఏపీ మంత్రి కాకాణి గోవర్ధర్ రెడ్డికి ఏపీ హైకోర్టులో షాక్ తగిలింది. ఆయనపై ఉన్న ఫైళ్ల చోరీ కేసును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 13న నెల్లూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓ చోరీ జరిగింది. కొన్ని కీలకమైన ఫైళ్లు మాయం కావడం అప్పట్లో కలకలం రేపింది. ఈ దొంగతనం కేసులో పోలీసుల దర్యాప్తు సరిగా జరగడం లేదని.. స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపిస్తేనే వాస్తవాలు బయటపడతాయని నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అప్పట్లో ఇచ్చిన అప్పట్లో నివేదికను సుమోటో పిల్‌గా పరిగణించి విచారణకు స్వీకరించింది. అసలింతకీ ఏం జరిగిందంటే.. అప్పటి కి ఎమ్మెల్యే అయిన కాకాణి గోవర్ధన్ తెలుగుదేశం సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సోమిరెడ్డికి విదేశాల్లో భారీగా ఆస్తులు ఉన్నాయని.. కొన్ని పత్రాలను మీడియాకు విడుదల చేశారు. వెంటనే స్పందించిన చంద్రమోహన్ రెడ్డి కాకాణిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కాకాణి విడుదల చేసిన డాక్యుమెంట్లు ఫేక్ అని ఛార్జ్‌షీట్ ఫైల్ చేశారు. కేసు విచారణలో ఉన్న సమయంలోనే కాకాణికి జగన్ కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో మంత్రి పదవి దక్కింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఏప్రిల్‌లో నెల్లూరులోని కోర్టులో చోరీ జరిగింది. ఈ దొంగతనం కేసులో.. కోర్టు నుంచి కీలకమైన డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు చోరీ అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. కాకాణి కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు మాయం అయ్యాయని గుర్తించడంతో ఈ వ్యవహారం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ కేసునే సీబీఐకి అప్పగిస్తూ ఇప్పుడు ఏపీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కాగా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫైల్స్ చోరీ ఘటనపై దర్యాప్తు సీబీఐకి అప్పగిస్తే కాకాణి ఇరుక్కోవడం ఖాయమన్న చర్చ అప్పట్లోనే జోరుగా సాగింది. నెల్లూరు కోర్టులో ఉన్న ఫైల్స్ చోరీ అయ్యాయని ముందుగా ఒప్పంద బెంచ్ క్లర్క్ గా పనిచేస్తున్న నాగేశ్వరరావు చేసిన ఫిర్యాదుపై అసలా ఫైల్స్ కోర్టు అధీనంలోనే లేవని, అవి పోలీస్ స్టేషన్ లో ఉన్నాయని నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని హైకోర్టుకు నివేదిక సమర్పించడం అప్పట్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. గుర్తు తెలియని వ్యక్తులతో బెంచి క్లర్కు నాగేశ్వరరావు కుమ్మక్కై కట్టుకథ అల్లాడని, పత్రాలు చోరీ అయ్యాయని కోర్టును తప్పదారి పట్టించాడని ఆ నివేదికలో జస్టిస్ యామిని పేర్కొన్నారు. అంతే కాకుండా ఈ మొత్తం వ్యవహారంపై స్వతంత్ర సంస్థతో సమగ్రంగా దర్యాప్తు చేయించాలని తన నివేదికలో జస్టిస్ యామిని హైకోర్టుకు విన్నవించారు. ఆ మేరకే ఇప్పుడు హైకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించింది.

## నేడు భారత రాజ్యాంగం దినోత్సవం

### -భారత రాజ్యాంగం వర్ధిల్లాలి

సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిన దేశం భారతదేశం. ఎందరో స్వాతంత్ర్యసమరయోధుల త్యాగ ఫలితాలతో 1947 ఆగస్టు 15న స్వతంత్ర భారత్‌గా అవతరించింది. ఆ తర్వాత ప్రతి స్వతంత్ర దేశానికి ఒక రాజ్యాంగం వుండాలి. రాజ్యాంగం అంటే దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక వంటిది. ఆ దీపస్తంభపు వెలుగుల్లో సర్వసత్తాక సౌర్వభౌమాధికార దేశంగా ప్రగతి వైపు అడుగులు వేయాలి. అందుకనే రాజ్యాంగానికి ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో అంతటి విశిష్టమైన స్థానముంది. కోట్లాదిమంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన దేశం కంటే ముందు అనేకదేశాలు రాజ్యాంగాలను రచించాయి. దేశంలో అనేక మతాలు, తెగలు, ఆదీవాసీలు, దళితులు, అణగారిన, పీడనకుగురైన వర్గాలు... తదితరులున్నారు. వీరి ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ రచన ఒక సవాల్‌లాంటిదే. ఈ నేపథ్యంలో భారత మొదటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ నేతృత్వంలోని రాజ్యాంగ సభ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ సారథిగా డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటైంది. రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ భిన్నత్వ సమ్మేళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఎంతగానో శ్రమించారు. రాజ్యాంగమంటే కేవలం ప్రభుత్వ విధివిధానాలు, శాసనసభల రూపకల్పనే కాదు కోట్లాది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింభించాలన్నది ఆయన ప్రధానాశయం. ఆయన కృషి ఫలితంగానే ప్రపంచంలోనే కొత్తదైన రాజ్యాంగం రూపుదిద్దుకుంది. అందుకనే ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాల కంటే భారతరాజ్యాంగం ఉన్నతవిలువలు కలిగిందంటూ మన్ననలు పొందింది. భారత రాజ్యాంగానికి 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదం తెలిపింది. 2015లో అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా నవంబర్ 26న ఏటా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. మన దేశంలో ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. 1949లో ఇదే రోజున భారత రాజ్యాంగానికి రాజ్యాంగ సభ ఆమోదం తెలిపింది. తర్వాత 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.




నవంబర్ 26ను నేషనల్ లా డే లేదా సంవిధాన్ దివస్‌గానూ పిలుస్తారు. నేటికి భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 73 ఏళ్లు పూర్తవుతుంది. ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవాలని నవంబర్ 19, 2015న భారత ప్రభుత్వం ప్రకటించింది. ముంబైలో అంబేద్కర్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఈ ప్రకటన చేశారు. 2015లో అంబేద్కర్ 125వ జయంతి వేడుకలను నిర్వహించారు. అంబేద్కర్‌కు నివాళిగా రాజ్యాంగ దినోత్సవం జరుపుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. రాజ్యాంగ దినోత్సవం పబ్లిక్ హాలిడే కాదు. కానీ ప్రభుత్వం విభాగాల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తారు.

# రామోజీరావు చట్టానికి అతీతుడు కాడు

విజయవాడ మార్గదర్శి చిట్ ఫండ్ వ్యవహారంపై జలవనరుల మంత్రి అంబటి రాంబాబు మాట్లాడారు. మంత్రి మాట్లలాతూ ఇప్పటంలో చిన్న విషయం మీద గగ్గోలు పెట్టారు. పవన్ కల్యాణ్ అయితే, ప్రభుత్వాన్ని కూల్చేయాలన్నారు. చట్టబద్ధంగా ఎవరైనా చిట్ఫండ్ వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, రామోజీ చట్టానికి వ్యతిరేకంగా చిట్ ఫండ్ వ్యాపారం చేస్తున్నారు. రామోజీ సంస్థలన్నీ చట్ట వ్యతిరేకంగా ఏర్పాటయ్యాయి. మార్గదర్శి విచ్చలవిడిగా చట్టాల నిబంధనలు ఉల్లంఘించింది. ఎవరైనా చిట్ ఫండ్ నిబంధనలు పాటించాల్సిందే. చిట్ ఫండ్ కంపెనీలపై రాష్ట్ర వ్యాప్తంగా సోదాలు జరుగుతున్నాయి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నారు. మార్గదర్శి చట్టాన్ని ఉల్లంఘించి అనేక అక్రమాలకు పాల్పడుతోంది. చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నవారు ఎవరైనా, చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. రామోజీ సంస్థలన్నీ చట్టానికి వ్యతిరేకంగానే నిర్మితమయ్యాయని, ఒక్కొక్కటి తేటతెల్లమవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం మార్గదర్శి కేసు సుప్రీం కోర్టులో ఉంది. రామోజీ రావు చట్టవ్యతిరేకంగా మార్గదర్శి నడుపుతున్నాడని అన్నారు. మొన్న జరిగిన సోదాల్లో మోసాలు చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. చిట్స్ సొమ్మును ప్రత్యేక ఖాతాలో వేయాలి. ప్రతి చిట్కు ఒక ఖాతా ఉండాలని చట్టంలో ఉంది. మార్గదర్శిలోని అన్నింటికీ ఒకే ఖాతా ఉందని అన్నారు. సోదాల్లో అధికారులు ఆ విషయాన్ని గుర్తించారు. చిట్ పాడుకున్నవారిని ష్యూరిటీల పేరుతో వేధించి, కొంతకాలం నగదును హోల్డ్ చేస్తున్నారు. ఎవరి ష్యూరిటీ తీసుకెళ్లిన రిజక్ట్ చేస్తున్నారు. అలా వేల కోట్లను వారికి సంబంధించిన వేరే కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. 50 ఏళ్ల నుంచి చట్ట వ్యతిరేకంగానే వ్యాపారం చేస్తున్నారు. రామోజీ వైట్ కాలర్ క్రిమినల్. రామోజీ ఆర్థిక నేరగాడు. మార్గదర్శి ఖాతాలను వేరే ఖాతాల్లో జమ చేయడం ఆర్థిక నేరం. ఫండ్స్ను ఇతర సంస్థలకు మళ్లించడం నేరం. రామోజీ రావు చట్టానికి అతీతుడు కాదు. మార్గదర్శిలో చిట్టీలు వేసేవారు ఆలోచించుకోవాలి. చిట్ ఫండ్ కంపెనీ వేరే వ్యాపారాలు చేయకూడదు. పైసా పెట్టుబడి లేకుండా వేల కోట్ల సామ్రాజ్యం ఎలా ఏర్పాటు చేశాడో. రామోజీ రావు చెప్పాలి. మేం కక్ష సాధిస్తున్నామని అనడం సరికాదు. చట్టాలను ఉల్లంఘిస్తే ఎవరిమీదనైనా కేసులు పెడతాం. అక్రమంగా డిపాజిట్లు సేకరించమని కోర్టులో చెప్పి, ఇప్పటి కీ డిపాజిట్లే సేకరిస్తున్నారు. చట్టాలకు అతీతంగా ఎవరూ వ్యవహరించినా ప్రభుత్వం ఉపేక్షించదు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఎవరైనా ఖండించాల్సిందేనని అయన అన్నారు.

# సంక్రాంతికి సిద్ధమౌతున్న కోళ్లు, కత్తులు



ఏలూరు, నవంబర్ 25, ఆంధ్రప్రదేశ్‌లో పందెం కత్తులు అలజడి రేపాయ్. వందో, రెండొందలో కాదు.. ఏకంగా వేలల్లో కత్తులు పట్టుబడ్డాయ్. అవును, సంక్రాంతికి ముందే కోడి కత్తులు కలకలం రేపుతున్నాయ్. కత్తులను కోడి కాళ్లకు కట్టకుండానే యుద్ధానికి సై అంటున్నాయ్. రారమ్మంటూ పందెంరాయుళ్లను ఊరిస్తున్నాయ్. అవును, ఎన్టీఆర్ జిల్లాలో అప్పుడే కోడి కత్తులు సై అంటే సై అంటూ కాలు దువ్వుతున్నాయ్. సంక్రాంతి పండగ కోసం పెద్దఎత్తున రెడీ అవుతున్నాయ్ కోడి కోత్తులు. పదులు వందల్లో కాదు, వేలల్లో సిద్ధమవుతున్నాయ్. చిన్న కుటీర పరిశ్రమగా ఈ కోడి కత్తులను తయారు చేస్తున్నారు కొందరు. విస్సన్నపేటలో కోడి కత్తుల తయారీ కేంద్రాలపై మెరుపు దాడులు చేశారు పోలీసులు. 2,300కోడి కత్తులను, ఐదు తయారీ మిషన్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. సంక్రాంతి టైమ్‌లో కోడి పందేల నియంత్రణకు ఇప్పట్నుంచే చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు ఏసీపీ రమేష్. ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్రాంతి అంటేనే కోడిపందేలు. పండుగ తేదీ సమీపిస్తుండటంతో పందెం రాయుళ్లు రెడీ అయిపోతున్నారు. పందెం కోళ్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి నుంచే వాటికి ట్రైనింగ్ ఇస్తున్నారు. కోడి పందేల ఏర్పాటుకు కసరత్తులు గట్టిగానే చేస్తున్నారు. ఇక ఈ కోడిపందేల నిర్వహణను అడ్డుకునేందుకు పోలీసులు ఎంత ప్రయత్నించినా, అది బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. కారణం, సామాన్యులు మొదలు, రాజకీయ ప్రముఖుల వరకు అందరూ ఈ కోడి పందేలను నిర్వహించడమే. పలు చోట్ల పెద్దల అండతోనే ఈ కోడి పందేలు నిర్వహించడం జరుగుతుంది. మరి ఈసారి కోడిపందేలు ఎలా జరుగుతాయో చూడాలి.

# రుషికొండలో నారాయణ పర్యటన

విశాఖపట్టణం, నవంబర్ 25, (న్యూస్ పల్స్)వివాదాస్పద రుషికొండ నిర్మాణాలపై ప్రభుత్వానికి క్లీన్ చిట్ ఇచ్చారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ. టూరిజం ప్రాజెక్ట్ కోసం ఖరీదైన విల్లాలు తప్ప ప్రచారంలో ఉన్నట్టు ముఖ్యమంత్రి నివాస భవనాల స్థాయిలో ఎటువంటి నిర్మాణాలు జరగడం లేదన్నారు. అయితే, పర్యావరణంకు జరుగుతున్న హాని మాత్రం క్షమించరానిది అన్న నారాయణ.. మంత్రులు, సలహాదారులపైన ఫైర్ అయ్యారు. అతి రహస్యం బట్టబయలు అన్నట్టుగా కోర్టు ఆదేశాలతో వస్తే తప్ప నిజాలు ప్రజలకు తెలియకుండా చూడడం సరైన విధానం కాదన్నారు.. ఆగస్టులో రుషి కొండ సందర్శన కోసం హైకోర్టును ఆశ్రయించాను.. మూడు నెలల పాటు నాకు అవకాశం ఇవ్వలేదని.. మళ్లీ కోర్టుకు వెళ్లడంతో ఈ రోజు చూడటానికి అనుమతిచ్చారన్నారు.. నేను చూసి వచ్చాను, ఇక్కడ సీఎం కార్యాలయం లాంటిది కట్టడం లేదన్న ఆయన.. కానీ విలాసవంతమైన భవనాలు కడుతున్నారు. ఈ ప్రభుత్వ పెద్దలు పర్యావరణాన్ని హత్యాచారం చేసింది.. విల్లాలను ఎక్కడైనా కట్టుకోవచ్చు, అనకాపల్లిలో ఇతర చోట కట్టవచ్చు.. కానీ, ప్రకృతిని నాశనం చేసిన పాపం మాత్రం ఊరికే పోదని హెచ్చరించారు. కట్టడం చట్ట ప్రకారమే.. కానీ, కొండను తొలిచేయడం నేరం అన్నారు నారాయణ.. ఇక్కడ జరుగుతున్న నిర్మాణాలలో అధికారులు కూడా రాత్రి బస చేసే అనుమతి లేదన్న ఆయన.. కేవలం పర్యాటకులు ఉండడానికి విల్లాలు మాత్రమే నిర్మిస్తున్నారు.. మిడి మిడి జ్ఞానంతో ఉన్న మంత్రులు మాట్లాడటం వల్ల ఇది ఇంతవరకు వచ్చిందని మండిపడ్డారు.. రుషికొండ వెళ్ళేందుకు కోర్టు అనుమతి ఇచ్చిన మూడు నెలలకు కానీ ప్రభుత్వం అంగీకరించ లేదు.. నేను ఏమైనా పేలుడు పదార్థాలు తీసుకుని వెళుతున్నానా..? ఉగ్రవాదినా..!? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఋషికొండలో నిర్మాణ ప్రణాళికలు చూసినప్పుడు రెండు మూడు రకాల రిసార్ట్స్, భవనాలు తప్ప ఎటువంటి ఇతర కట్టడాలు కనిపించడం లేదన్నారు..

ముఖ్యమంత్రి ఇంటి కోసం నిర్మాణంగా జరుగుతున్నది ప్రచారంగానే కనిపించింది.. సీఎం నివాసం వుండే భవంతి లాంటి నిర్మాణాలు ఏవీ ఋషికొండలో కనిపించ లేదన్నారు. కానీ, రుషికొండ ఒరిజినాలిటీ దెబ్బ తీస్తున్నారు.. విశాఖలో చాలా భూములు ఉండగా సహజసిద్ధమైన ప్రకృతిని ఎందుకు దెబ్బతీయాలి.. ఇక్కడ ప్రకృతిపై అఘాయిత్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ. అయితే, నారాయణతో పాటు మరికొందరు సీపీఐ నేతు రుషికొండ వెళ్లేందుకు ప్రయత్నించగా.. అడ్డుకున్నారు పోలీసులు.. ఆయన కోసం ఓ వాహనాన్ని ఏర్పాటు చేసి.. పంపించారు.. దీంతో, పోలీసులు, సీపీఐ నేతలు, కార్యకర్తల మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకోవడంతో.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

# కొడాలి, అనిల్, అవంతిలకు షాక్

విజయవాడ, నవంబర్ 25,వరస సమీక్షలు.. హెచ్చరికలు తర్వాత మాట వినని పార్టీ నేతలకు షాక్ ఇచ్చారు వైసీపీ అధినేత, సీఎం జగన్. వైసీపీలో కీలక స్థానాల్లో ఉన్న ముఖ్య నేతలనే పక్కన పెట్టి కొత్త వారికి అవకాశం ఇచ్చారు. రెండు నెలల కిందట గడప గడపకు మన ప్రభుత్వం సమీక్ష సందర్భంగా రీజినల్ కోఆర్డినేటర్ల పనితీరును అసెస్ చేసిన జగన్.. కొంతమంది పనితీరుపై ఓపెన్‌గానే అసంతృప్తి వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు కొడాలి నాని, అనిల్ కుమార్ యాదవ్, మంత్రి బుగ్గన పేర్లను ఆయన ప్రస్తావించారు. ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించారు కూడా. కో ఆర్డినేటర్లుగా ఉండలేకపోతే తప్పుకోవాలని.. కొత్త వారికి అవకాశం ఇస్తానని ఆ రోజే నిక్కచ్చిగా చెప్పేశారు. అప్పటి నుంచే కసరత్తు జరిగింది. ఈ ప్రక్రియలో పార్టీ అధినేత రెండు అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఒకటి.. పని చేయకపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సంకేతాలు పంపారు. రెండోది.. సొంత జిల్లాలకు చెందిన నేతలు అదే జిల్లాలకు సమన్వకర్తలుగా ఉండకుండా విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. గతంలో మంత్రి బొత్స సత్యనారాయణ పరిధిలో ఉన్న విజయనగరం జిల్లాలను ఇప్పుడు వైవీ సుబ్బారెడ్డికి అప్పగించారు. అదే విధంగా బాలినేని శ్రీనివాసరెడ్డి దగ్గర ఉన్న ప్రకాశం.. బాపట్ల జిల్లాలను బీద మస్తానరావు, భూమన కరుణాకర్‌రెడ్డిలకు ఇచ్చారు. ప్రభుత్వ సలహాదారు, ప్రభుత్వ, పార్టీ విధానపరమైన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించే సజ్జల రామకృష్ణారెడ్డి బాధ్యతల్లోనూ మార్పులు చేశారు. సజ్జల ఇప్పటికే 175 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇంఛార్జులకు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. అబ్జర్వర్ల బాధ్యత కూడా ఆయనకే పార్టీ అప్పగించింది. దీనితో గతంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు బుగ్గనతో కలిసి సమన్వయకర్తగా ఉన్న సజ్జలను ఆ బాధ్యతల నుంచి విముక్తి కలిగించారు. ఇక తనకు కేటాయించిన జిల్లాల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో అనిల్‌ను తప్పించి.. కడప, తిరుపతి బాధ్యతలు బాలినేనికి ఇచ్చారు. పల్నాడు జిల్లా కోఆర్డినేటర్‌గా ఉండి ఒకటిఅరసార్లు తప్ప.. అక్కడ పనైనా చూడని కొడాలి నానిని కూడా పక్కన పెట్టేశారు. జిల్లా అధ్యక్షుల విషయంలోనూ సీఎం జగన్ ఇదే విధానాన్ని అవలభించారు. అధ్యక్ష బాధ్యతలు సరిగ్గా చూడని వారిని నిర్మొహమాటంగా పక్కన పెట్టారు. గుంటూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల అధ్యక్షులు రాజీనామాలు చేస్తే వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించారు. అదే విధంగా పని తీరు సంతృప్తికరంగా లేకపోవటంతో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష బాధ్యతల నుంచి మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్ప శ్రీవాణిని తప్పించి ఆమె భర్త పరీక్షిత్ రాజుకు పగ్గాలు ఇచ్చారు. పార్టీ అనుబంధ విభాగాల కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కరరెడ్డికి కొత్త బాధ్యతలు ఇవ్వటంతో.. తిరుపతి జిల్లా అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి.. నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిని తీసుకొచ్చారు. ఈ మధ్య ఆడియో టేపులతో వైరల్ అవుతున్న అవంతిని పక్కన పెట్టి ఆ స్థానంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ కు విశాఖ జిల్లా బాధ్యతలను ఇచ్చారు. అవంతి సెల్ఫ్‌గోల్స్ వేసుకున్నారని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ప్రకాశం జిల్లా లో కూడా బుర్రా మధు సూధన్ యాదవ్ స్థానంలో మాజీ ఎమ్మెల్యే జంకే వెంకటరెడ్డికి అవకాశం ఇచ్చారు. ఈ ప్రక్షాళన చర్యలు చూస్తుంటే.. పార్టీ నేతల పనితీరుపై అధినేత సీరియస్‌గానే ఉన్నారని.. వారి ప్రొగ్రస్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారనే టాక్ నడుస్తోంది. మరి.. ఈ చర్యల తర్వాత ఎంత మంది తమ పనితీరుకు మార్కులు వేయించుకుంటారో చూడాలి

### ఏపీలో ప్రమాదాలు.. 10 నెలల్లో 5,831 మంది మృతి

విజయవాడ, నవంబర్ 25,కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో రాష్ట్రంలోనే కాదు.. దేశ్యాప్తంగా కూడా రోడ్డు ప్రమాదాల సంఖ్య భారీగా తగ్గిపోయింది.. దానికి ప్రధాన కారణం, లాక్‌డౌన్, కర్ఫ్యూ లాంటి చర్యలతో పాటు.. కఠినమైన రూల్స్ కారణంగా.. ప్రజలు తక్కువ సంఖ్యలో బయటకు రావడమే.. ఇక, మళ్లీ సాధారణ పరిస్థితులు వచ్చిన తర్వాత.. క్రమంగా రోడ్డు ప్రమాదాలు.. ఆ ప్రమాదాల్లో మృత్యువాత పడేవారి సంఖ్య కూడా భారీగా పెరుగుతూ పోతోంది.. కరోనా సమయంలో ఇంటికే పరిమితమైన ప్రజలు.. ఆ తర్వాత.. మళ్లీ టూర్లు, ట్రిప్పులకు వెళ్తున్నారు.. రోడ్లపై రద్దీ కూడా పెరిగిపోయింది.. దీంతో, ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. ఇక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల్లో ఈ ఏడాది బారీగా పెరుగుదల నమోదైంది.. ఈ ఏడాదిలో 9.95 శాతం మేర రోడ్డు ప్రమాదాలు పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి..

## వందే భారత్ తో విశాఖకు 4 గంటలే

విజయవాడ, నవంబర్ 25, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా పట్టాలెక్కనుంది. అత్యాధునిక సౌకర్యాలతో పాటు అమితవేగంతో దూసుకెళుతోన్న ఈ సెమీ హైస్పీడ్ రైలు ఏపీలోను పరుగులు పెట్టనుంది. మొదటి దశలో భాగంగా విశాఖపట్నం నుంచి విజయవాడ వరకు నడిపేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డిసెంబర్ రెండో వారంలో అధికారికంగా ప్రారంభించేందుకు విస్తృత స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. త్వరలో విశాఖకు రానున్న ఈ ట్రైన్ ట్రయల్ రన్ వచ్చే నెలలో నిర్వహించనున్నారు. సాధారణంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటకు 160 కి.మీ. వేగంతో దూసుకెళ్లనున్నాయి. ఈ లెక్కన విశాఖపట్నం నుంచి విజయవాడకు ప్రస్తుతం రైలు ప్రయాణానికి 6 గంటల సమయం పడుతుండగా.. వందే భారత్ రైలు రాకతో కేవలం 4 గంటల్లోనే విజయవాడ చేరుకోవచ్చు. కాబట్టి ప్రయాణికులకు రెండు గంటల ప్రయాణం తగ్గనుంది. కాగా ఈ రైళ్లో అత్యాధునిక సదుపాయాలుంటాయి. ముఖ్యంగా ఎమర్జెన్సీ లైటింగ్ వ్యవస్థ ఉంటుంది. ప్రతి కోచ్‌కు 4 లైట్లు ఉంటాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ లైట్లు ఉపయోగపడతాయి. అలాగే కోచ్‌లకు బయటవైపు నుంచి 4 కెమెరాలు అమర్చి ఉంటాయి. వెనుక వైపు నుంచి మరొకటి ఉంటుంది. ప్రతి కోచ్‌కు 4 ఎమర్జెన్సీ ద్వారాలు ఉంటాయి. అన్ని కోచ్‌లు పూర్తిగా ఏసీ సదుపాయంతో ఉంటాయి. ఇక అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటుచేసిన అగ్నిమాపక పరికరాలు కొద్దిపాటి పొగను కూడా వెంటనే పసిగట్టి ప్రయాణికులను అప్రమత్తం చేస్తాయి. ఇక ఇందులో చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న వందేభారత్ రైళ్లలో నిర్దేశించిన ధరల ప్రకారం చూస్తే విజయవాడకు చైర్‌కార్‌లో దాదాపు రూ.850, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో రూ.1,600 నుంచి రూ.1,650 వరకూ ఉండే అవకాశాలున్నాయివచ్చే మూడేళ్లలో 475 వందే భారత్ రైళ్ల తయారీకి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలాగే 2026 కల్లా మొదటి బుల్లెట్ ట్రైన్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధిపై మంత్రి మాట్లాడుతూ 138 స్టేషన్లకు మాస్టర్‌ప్లాన్లు రూపొందించామని, 57 స్టేషన్లకు డిజైన్లు ఖరారు చేశామన్నారు. '475 వందేభారత్ రైళ్ల లక్ష్యం.. గత బడ్జెట్‌లో 400 రైళ్లను మంజూరు చేశాం. అంతకు ముందు 75 రైళ్లను మంజూరు చేశాం. రాబోయే మూడేళ్లలో పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటాం' అని మంత్రి స్పష్టం చేశారు.

## వైసీపీ నేతలు స్వరం మారుతోంది...

విజయవాడ, నవంబర్ 25, ఇంకా అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదిన్నరకు పైగా సమయం ఉన్నా.. ఇప్పుడే ఎన్నికల వేడిని తలిపిస్తున్నాయి.. రాజకీయాలు. ఏపీలోని పాలిటిక్స్‌లో పవన్ సెంటర్ పాయింట్ గా నిలిచారు. దీంతో ఏపీలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయని.. పవన్ కల్యాణ్‌ను వైసీపీ పొలిటికల్ ట్రాప్‌లో పడేసే ప్రయత్నం చేస్తోందని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. అంతేకాదు జనసేన అధ్యక్షుడిపై వైసీపీ వ్యూహం మారిందని వ్యాఖ్యానిస్తున్నారు. నిన్నటి వరకు పవన్ కల్యాణ్‌ను నేరుగా అటాక్ చేసిన వైసీపీ నేతలు ఇప్పుడెందుకు రూటు మార్చడమే కాదు.. పవన్‌పై ఒంటికాలిపై లేచిన నేతలంతా ఎందుకు దూకుడు తగ్గించారని చెబుతున్నారు. అవును పవన్ విషయంలో వైసీపీ మంత్రులు, నేతలు కొంచెం వెనక్కి తగ్గినట్లే అనిపిస్తుంది తాజా పరిస్థితి చూస్తుంటే..అయితే, ఇన్నాళ్లూ పవన్‌తో నువ్వెంత అంటే నువ్వెంత అన్న రీతిలో దూకుడు చూపించిన వైసీపీ నేతలు ఎందుకో మరి కాస్త వెనక్కు తగ్గారు.. ఈ తగ్గడం వెనకున్న వ్యూహమేంటో.. చంద్రబాబు వలలో చిక్కుకోవద్దంటూ పవన్‌కు సుద్ధులు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఫేస్ టు ఫేస్ వెళ్లడం కంటే.. ఈ రూటే బెటరనుకున్నారేమో.. అందుకే దూకుడు తగ్గించినట్లు తెలుస్తోంది. పవన్‌పై ఏదైనా కామెంట్ చేయాలన్నా, కౌంటర్ ఇవ్వాలన్నా ముందుండే ఫైర్ బ్రాండ్ రోజా.. చంద్రబాబు తన కొడుకు కోసం.. పవన్‌కల్యాణ్‌ను బలి చేస్తున్నారన్నారు మంత్రి రోజా. ఎన్టీఆర్ కుటుంబాన్ని వాడుకున్నట్లే పవన్‌ని వాడుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు పవన్‌ను వాడుకుని వదిలేస్తున్నారని.. తోటి నటుడిని వాడుకుని వదిలేస్తుంటే తనకు బాధగా ఉందని చెప్పారు. మరోవైపు జనసేన సైనికులకు పెద్దిరెడ్డి హితబోధ చేశారు. మంత్రి రోజా మాత్రమే కాదు.. ఆ వెంటనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా జనసేన సైనికులకు హితబోధ చేశారు. జనసేన పార్టీకి ఓటు వేసేవారు ఇకనైనా ఆలోచించాలన్నారు. అంతేనా,జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను ముఖ్యమంత్రిగా చూడాలని అనుకోవాలన్నారు. కానీ చంద్రబాబు నాయుడుకి బంట్రోతుగా ఉండి ఆయన కిందపనిచేస్తూ ఉంటే జనసేన ఓటర్లు ఎలా జీర్ణించుకుంటారన్నారు. మొత్తం మీద పవన్‌కల్యాణ్‌ను ఆటలో అరటిపండుగా వైసీపీ నేతలు చిత్రీకరిస్తున్నారు. చంద్రబాబును దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు. మరి ఇది అధికారపార్టీకి ఎంత ప్లస్ అవుతుందో..ఎంత మైనస్ అవుతుందో చెప్పలేని పరిస్థితి.. కానీ పవన్ కల్యాణ్‌ను ట్రాప్ చేసే ప్రయత్నం మాత్రం పీక్స్‌లో ఉన్నట్లు సమాచారం.

## పొగమంచు తో రాకపోకలకు అంతరాయం

### ఢీకొన్న వాహనాలు, పలువురికి గాయాలు

నెల్లూరు పొగ మంచు కారణంగా నెల్లూరు జిల్లా మనుబోలు మండలం బద్దివోలు సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కంటైనర్, కారు, ద్విచక్ర వాహనం ఒక దానికి ఒకటి ఢీ కొట్టిన ఘటనలో పలువురికి గాయాలు అయ్యాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా తెల్లవారుజామునుండే కమ్మేసిన పొగ మంచు, జాతీయ రహదారిపై ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయాలు కలుగుతోంది. దాంతో విద్యార్దులు, ఉద్యోగులు తమ తమ గమ్యస్థానాలకు ఆలస్యంగా చేరుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా గురువారం వరకు ఉపరితల ఆవర్తన ద్రోని ప్రభావంతో వర్షాల వల్ల ఇబ్బందులకు గురైన ప్రజలు నేడు తెల్లవారుజాము నుండి తీవ్ర పొగ మంచుతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు, చెన్నై ,కలకత్తా ప్రధాన జాతీయ రహదారిపై వాహనాలు చాలా నిదానంగా కదులుతున్నాయి, దీంతో కాలేజీలకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థుల దగ్గర నుండి ప్రభుత్వ ఉద్యోగులు ఇతర అన్ని రంగాల ప్రయాణికులు,సరుకు రవాణా వాహనాలు తమ గమ్యస్థానాలకు ఆలస్యంగా చేరుకుంటున్నారు, ఈ పొగ మంచు ప్రభావం వల్ల రహదారులపై ప్రమాదాలు జరిగే అవకాశం తో పాటు సాధారణ ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులు కూడా గురవుతున్నారు ప్రకృతి ఒక్కరోజులోనే ఇలా మారిపోవడంతో కొన్ని ఆరోగ్యకరమైన సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

# శ్రీశైలం పీఠాధిపతికి ఘనంగా స్వాగతం పలికిన పట్టణ ప్రజలు.

**నందికొట్కూరు లో పలుచోట్ల మొక్కలు నాటిన పీఠాధిపతి.**

నందికొట్కూరు. నవంబర్ 25శ్రీశైల ధర్మరక్షణలో భాగంగా శ్రీశైల ఖ్యాతి ప్రపంచానికి చాటుతూ ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన నిర్వహిస్తూ దాదాపు 650 కిలోమీటర్లు సాగుతున్న మహా పాదయాత్ర గురువారం రాత్రి నందికొట్కూరు పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పట్టణ ప్రజలు శ్రీశైల పిఠాధిపతి డాక్టర్ చెన్న సిద్ధ రామ పండితారాధ్య శివ చార్య స్వామికి ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కమిషనర్ కిషోర్ ఆధ్వర్యంలో పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణంలో, శ్లోక పాఠశాలలో స్వామివారు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆత్మకూరు రోడ్ లోని జమ్మి చెట్టు ,శమీ వృక్షం దగ్గర మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు వేలాది గ తరలిరావడం జరిగింది. అనంతరం శ్రీశైలం పీఠాధిపతి స్వామివారు శ్రీశైలానికి పాదయాత్ర కొనసాగించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైల జగద్గురు మహా పాదయాత్ర నందికొట్కూరు సేవా సమితి వారు కాలూరి శివప్రసాద్, బీటెక్ రాజు, సూది రెడ్డి శ్రీధర్ రెడ్డి, బద్దుల శ్రీకాంత్, సూది రెడ్డి రమేష్ రెడ్డి, చింత విజ్జి, భక్తులు పాల్గొన్నారు.



# హెచ్ బి ఎస్ కాలనీలో పలు అభివృద్ధి పై భూమి పూజ.

**వైయస్సార్సీపి సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి**



ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు పట్టణంలో 21వ వార్డు హెచ్.బి.ఎస్ కాలనీ (టెకు చెట్ల) దగ్గర రూ. 15లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన మన ప్రియతమ నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు, ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని, ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" గారి ఆధ్వర్యంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ఒక పక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధి ధ్యేయంగా సీఎం జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె. శివన్న, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్. రఘు, వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డిఈఈ మనోహర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, ప్రధాన కార్యదర్శి యూకె. వీరేంద్ర, కోశాధికారి, 21వ వార్డు ఇన్ చార్జ్ తారా రాజశేఖర్, కో ఆపరేటివ్ స్టోర్ చైర్మన్ షబ్బీర్ ఆహ్మద్, కౌన్సిలర్లు, ఇన్ చార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలు అసెంబ్లీ స్థానాన్ని గెలిచి చంద్రబాబు లోకేష్ లకు కానుకగా ఇస్తాం

**బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం బలంగా ఉంది**

**తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కొంకుల రాంబాబు**

బద్వేలు, జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బద్వేలు స్థానాన్ని గెలిచి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ లకు కానుకగా ఇస్తామని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొంకులరాంబాబు ధీమా వ్యక్తం చేశారు ఈసారి బద్వేల్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఏ శక్తి కూడా అడ్డుకోలేదని ఆయన పూర్తి నమ్మకాన్ని కనపరిచారు2024లో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ దుందుభి కాయంవైకాపా పాలనతో ప్రజలు విసిగిపోయారుఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు గతంలో జరిగిన ఎన్నికలు వేరు జరగబోయే ఎన్నికలు వేరు అని ఆయన తెలిపారు వైకాపా మూడు సంవత్సరాల పాలనపై ప్రజలు అన్ని విధాలుగా విసుగెత్తి పోయారని ఆయన పేర్కొన్నారు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలనుముఖ్యమంత్రి అన్ని విధాల బురిడి కొట్టించినట్లు రాంబాబు ఆరోపించారు సంక్షేమ పథకాలు కేవలం కొద్ది మందికి మాత్రమే అందుతున్నాయి తప్ప అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందడంలేదని ఆయన ఆరోపించారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లు మూసి వేయించి పేదల ఉసురు పోసుకున్నట్లు ఆరోపించారు నిరుద్యోగులకు బృతి విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి గండి కొట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేదని చెప్పారు కుల మతాలకతీతంగా ప్రతి పండగకు ఉచితంగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే విషయాన్ని ఆయన గుర్తు చేశారు గత మూడేళ్లలో ఏ ఒక్కరికి ఈ పథకాలు ఎత్తివేసిన ఘనత కూడా జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు రైతులను జగన్ ప్రభుత్వం అన్ని విధాల మోసం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తామని జగన్మోహన్ రెడ్డి పదే పదే చెప్పడం రైతుల ఆగ్రహానికి కారణమైందన్నారు పేరుకే రైతుల సంక్షేమం అని చెబుతున్న ముఖ్యమంత్రి రైతులపై ఏమాత్రం శ్రద్ధ కన పరచడం లేదని అరోపించారు తెలుగుదేశం పార్టీ హయాములో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉండే వారిని కక్షలు కార్పన్యాలు ప్రజల మధ్య ఉండేవి కావన్నారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతిపక్ష నేతలపై అనేక కేసులు బనాయించి వారిని జైలు పాలు చేయడమే గాక మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు రాష్ట్రంలో చదువుకుంటున్న బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు కళాశాలలకు వెళ్లిన బాలికలు నడిరోడ్డుపై దారుణ హత్యలకు గురవుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు రాష్ట్రంలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఆయన ఉదాహరించారు

# మంచినీటికి ఇబ్బందులు పడుతున్న నందమూరి నగర్ వాసులు..

**మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేసిన..సిపిఐ నాయకులు..**

నంద్యాల నవంబర్ 25 )నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన నందమూరి నగర్ లోని జండా మాన్ ఎదురుగా ఉన్న శివాలయం వెనుక భాగాన 38వ వార్డు వీధులలో ప్రజలు మంచినీటికి ఇబ్బందులకు గురి అవుతున్నారని సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ తెలిపారు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాసులు నందమూరి నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి హుస్సేనా్న కాలనీవాసులు మన్ బాదుల్లా అబ్దుల్ రహీం సలీం అబ్దుల్ కలాం ఉన్నారు అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ, నందమూరి నగర్ ఏర్పడి 40 సంవత్సరములు కావస్తున్న కూడా ఈ ప్రాంతంలో ఇప్పటికీ మంచినీటికి ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు సక్రమంగా కుళాయిలకు నీరు రావడం లేదు ఎందుకు మంచినీరు రావడంలేదని మంచి నీరు కుళాయిలకు వదిలే వారిని అడగగా అక్కడ పైపులు లీకేజీ ఇక్కడ పైపులు లీకేజీ అంటూ సమాధానం చెబుతూ, కాలయాపన చేస్తున్నారు ఒక వారంలో కనీసం అంటే రెండు రోజులు మూడు రోజులు ఏదో ఒక చోట పైపులు లీకేజ్ అంటూ సమాధానం చెబుతూ ఉంటారుకుళాయిలకునీరు వదిలినప్పుడుబురదతోకలుచుటమైనీరు కుళాయిలకు రావడం జరుగుతుంది అక్కడి ప్రజలు కులాలకు బురద నీరు వచ్చే మేమెందుకు కుళాయి పనులు కట్టాలని అంటున్నారని, అన్నారు ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ వాటర్ వర్క్ డీఈ ఇక్కడి సమస్యలను పరిష్కరించి కుళాయిలకు సక్రమంగా రోజు కలుషితం లేని మంచినీటిని సరఫరా చేయాలని అంటున్నారు లేనియెడల మా ఏరియా 38వ వార్డుకు వస్తుంది మేము ఎటువంటి పన్నులు చెల్లించమని కచ్చితంగా చెబుతున్నారని అన్నారు.




# మాస్ రాజా రీ షూట్ లకు కేరాఫ్ అడ్రస్ అవుతున్నాడా?



కరోనా తరువాత చాలా వరకు నిర్మాతలు బడ్జెట్ పై నియంత్రన వుండాలని ఇందు కోసం చాలా వరకు హీరోయిన్ స్టాఫ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ల క్యారవాన్ ఖర్చులు వారి వ్యక్తగత సిబ్బంది ఖర్చులు తగ్గించుకోవాలని హీరోయిన్ ల వ్యక్తిగత సిబ్బంది ఖర్చులు వారి పారి పారితోషికం నుంచే ఖర్చు చేసుకోవాలంటూ ఆ మధ్య నిర్మాతలు ఓ నిర్ణయానికి రావడం..దాన్ని 'మా' కు వివరించడం తెలిసిందే. చిన్న విషయాల్లో బడ్జెట్ ని కంట్రోల్ చేయగలుగుతున్న ప్రొడ్యూసర్స్ ప్రధాన విషయంలో మాత్రం సరెండర్ అవుతున్నారు.ఎంత పక్కగా ప్లాన్ చేసుకుని బడ్జెట్ ని కంట్రోల్ లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నా రీ షూట్ ల కారణంగా అది కుదరకపోగా మరింతగా భారంగా మారుతోందని తెలుస్తోంది. మరీ ప్రధానంగా మాస్ మహారాజా రవితేజ సినిమాలకు ఇది ప్రతీసారి రిపీట్ అవుతుండటం గమనార్హం. ఇటీవల 'రామారావు ఆన్ డ్యూటీ' సినిమా విషయంలో రీ షూట్ లు చేయడం తెలిసిందే. దాని కారణంగానే సినిమా రిలీజ్ ఆలస్యం అవుతూ వచ్చింది కూడా.ఎంత రీ షూట్ లు చేసినా ఫైనల్ గా 'రామారావు ఆన్ డ్యూటీ' డిజాస్టర్ అనిపించుకుని భారీ నష్టాలని అందించింది. ఇప్పుడు రవితేజ నటిస్తున్న సినిమాకు కూడా ఇదే సమస్య తలెత్తిందని తెలుస్తోంది. మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'ధామాకా'. త్రినాథరావు నక్కిన డైరెక్ట్ చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టి.జి. విశ్వప్రసాద్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. శ్రీలీల కథనాయికగా నటిస్తోంది.ఈ మూవీకి కూడా రీ షూట్ లు తప్పలేదని తెలుస్తోంది. రీ షూట్ ల కోసం కొత్త రైటర్ సహకారం తీసుకున్నారట. అతను రాసిన సీన్ లని షూట్ చేసి మళ్లీ ఈ మూవీకి జోడించినట్టుగా తెలుస్తోంది. ఈ మూవీకి కథ మాటలు స్క్రీన్ ప్లే ని ప్రసన్న కుమార్ బెజవాడ అందించారు. తను రాసిన కొన్ని సీన్ లని పక్కన పెట్టి 'కార్తికేయ 2' కు ఓ రైటర్ గా వర్క్ చేసిన మణిబాబు కరణం అందించిన సీన్ లని రీ షూట్ చేసినట్టుగా తెలుస్తోంది.రవితేజ ఆ సీన్ లపై అభ్యంతరం చెప్పడం వల్లే దర్శకుడు త్రినాథరావు నక్కిన కొత్త రైటర్ తో మళ్లీ రాయించి రీ షూట్ చేశారట. ఫైనల్ గా రీ షూట్ చేసిన సీన్ లని చూసుకున్న రవితేజ ఓకే అని సంతృప్తిని వ్యక్తం చేశాడని తెలుస్తోంది. రీ షూట్ చేసి ఖర్చు కారణంగా ముందు అనుకున్న బడ్జెట్ కూడా పెరిగినట్టుగా తెలుస్తోంది. ఈ మూవీని డిసెంబర్ 23న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయబోతున్న విషయం తెలిసిందే.

# సమంత ఆరోగ్యంపై రూమర్స్ తో ఇబ్బంది పడుతున్న మేకర్స్..?

దక్షిణాది అగ్ర కథానాయిక సమంత గత కొన్ని నెలలుగా మైయోసైటిస్ అనే ఆటో ఇమ్యునో వ్యాధితో బాధపడుతున్న సంగతి తెలిసిందే. వీలైనంత త్వరగా ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని అందరూ కోరుకుంటున్నారు. అయితే సామ్ ఉన్నటుండి తీవ్ర అనారోగ్యానికి గురైందని.. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు హాస్పిటల్ లో జాయిన్ చేసినట్లుగా ఇప్పుడు నెట్టింట వార్తలు ప్రచారం అవుతున్నాయి.ఈ నేపథ్యంలో



సమంత ఆరోగ్యం గురించి వస్తోన్న వార్తలపై ఆమె టీమ్ స్పందించింది. సామ్ అనారోగ్యంతో ఆసుపత్రి పాలైందనే వార్తలను ఖండించారు. ఆమె ఆరోగ్యంగానే ఉందని.. హాస్పిటల్ లో చేరినట్లు వస్తోన్న వార్తల్లో ఎటువంటి నిజం లేదని.. ప్రస్తుతం ఇంట్లోనే ఉన్నారని పేర్కొన్నారు. దీంతో సమంత ఆరోగ్యం గురించి ఆందోళనకు గురైన ఆమె అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు.ఇకపోతే మయోసైటిస్ అనే అరుదైన రుగ్మతతో ఇబ్బందిపడుతోన్న సమంత.. గత కొన్ని నెలలుగా సినిమాలకు దూరమైంది. సోషల్ మీడియాలో కూడా యాక్టీవ్ గా కనిపించలేదు. అయితే వైద్యుల పర్యవేక్షణలోనే 'యశోద' సినిమా డబ్బింగ్ పూర్తి చేసి రిలీజ్ కు రెడీ చేసింది. ఈ క్రమంలోనే తన ఆరోగ్య పరిస్థితి గురించి వెల్లడించి అందరినీ షాక్ కు గురి చేసింది. దాని నుంచి బయటపడేందుకు చికిత్స తీసుకుంటున్నట్లు చెప్పి ఎమోషనల్ అయింది.ఇటీవల పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'యశోద' చిత్రం మిశ్రమ స్పందన తెచ్చుకుంది. అయితే పోటీగా మరో సినిమా లేకపోవడం సామ్ కు కలిసొచ్చింది. ఫైనల్ గా బాక్సాఫీస్ వద్ద ఆశించిన లాభాలు రాకపోయినా.. నష్టాల నుంచి బయట పడుతోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇక సమంత అనారోగ్యం కారణంగా అర్థాంతరంగా ఆగిపోయిన సినిమాలు ఆమె రాక కోసం వేచి చూస్తున్నాయి.శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ - సమంత హీరోహీరోయిన్లుగా నటిస్తున్న 'ఖుషి' చిత్రం ఇంకా సెట్స్ మీదనే ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో రూపొందితున్న ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్ షూటింగ్ ఇప్పటికే మెజారిటీ భాగం పూర్తయింది. కొన్ని రోజులు షూటింగ్ చేస్తే సినిమా అంతా అయిపోతుందని అనుకుంటుండగా.. విజయ్ 'లైగర్' ప్రమోషన్స్ కోసం వెళ్లడంతో కాస్త బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది.అదే సమయంలో సమంత ఆరోగ్యం దెబ్బ తినడంతో మళ్ళీ పునః ప్రారంభించడానికి చాలా టైం పడుతోంది. దర్శకుడు శివ నిర్వాణ మరియు హీరో విజయ్ మరో సినిమాకి షిఫ్ట్ అవ్వకుండా సామ్ కోసం వేచి చూస్తున్నారు. ఈ డిసెంబర్ లో క్రిస్మస్ స్పెషల్ గా ప్లాన్ చేసిన సినిమా.. వచ్చే ఏడాది సమ్మర్ కైనా రెడీ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. కాకపోతే ఆలస్యం కారణంగా వడ్డీలు పెరిగి బడ్జెట్ ఎక్కువ అవ్వొచ్చు. 'యశోద' విషయంలోనూ అదే జరిగింది.

# శివ కార్తికేయన్.. అందుకే ఈ స్థాయికి వచ్చాడు..!



కోలీవుడ్ వర్సటైల్ హీరో శివ కార్తికేయన్ గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. టీవీ రంగం నుంచి సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శివ.. కెరీర్ ప్రారంభంలో క్యారక్టర్ ఆర్టిస్టుగా నటించాడు. ఆ తర్వాత హీరోగా మారి వరుస విజయాలతో దూసుకుపోతున్నారు.వైవిధ్యమైన చిత్రాలు విలక్షణమైన పాత్రలతో శివ కార్తికేయన్ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. సింగర్ గా పాటలు పాడటమే కాదు.. లిరిసిస్ట్ గా పాటలు రాసి మల్టీ టాలెంటెడ్ అనిపించుకున్నారు. అంతేకాదు శివ కార్తికేయన్ ప్రొడక్షన్స్ బ్యానర్ ను స్థాపించి నిర్మాతగానూ సత్తా చాటుతున్నాడు.ఎలాంటి బ్యాగ్రౌండ్ సినీ ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన శివ కార్తికేయన్.. తన స్వయం కృషితో ఈ స్థాయికి ఎదిగాడు. సినిమాల్లోకి రావాలని ఆశపడే ఎందరికో ఆదర్శంగా నిలిచాడు. ఎలాంటి పొజిషన్ లో వున్నా.. తమ మూలాలను మర్చిపోకూడదని భావించే వ్యక్తి అతను.ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే సిద్ధాంతాన్ని పాటిస్తుంటాడు శివ కార్తికేయన్. సపోర్టింగ్ రోల్స్ చేస్తున్నప్పుడు అందరితో ఎలా ఉండేవాడో.. ఇప్పుడు హీరోగా రాణిస్తున్నప్పుడు కూడా అలానే ఉండటం ఆయనకే చెల్లింది.ఇండస్ట్రీలో పెద్దల పట్ల గౌరవం.. తన తోటి నటీనటులతో స్నేహ భావంతో మెలిగే విధానం శివ కార్తికేయన్ ను అందరిలో ప్రత్యేకంగా నిలిపాయి. తానొక స్టార్ అనే భావన ఏమాత్రం లేకుండా అందరితో కలిసి పోతుంటాడు. అందుకే చిత్ర పరిశ్రమలో శివ ని ఇష్టపడేవారే తప్ప ద్వేషించేవారు ఉండరు.ఇలాంటి మంచి లక్షణాలే భాషతో సంబంధం లేకుండా అందరూ శివ కార్తికేయన్ ను అభిమానించాలే చేశాయి. తమిళ నటీనటులతో కాదు.. తెలుగు కన్నడ మలయాళ హిందీ ప్రముఖులతోనూ అతనికి మంచి సాన్నిహిత్యం ఉంది. కుదిరినప్పుడల్లా వారిని కలుస్తూ ఏదొక మంచి విషయాలని నేర్చుకుంటూ ఉంటాడు.2022 ఏడాడిలో శివ కార్తికేయన్ అనేకమంది స్టార్ యాక్టర్స్ మరియు ఫిలిం మేకర్స్ ని మీట్ అయి ముచ్చటించారు. లేటెస్టుగా కోలీవుడ్ హీరో అజిత్ కుమార్ ను కలిసిన శివ.. ఆయనతో దిగిన ఓ ఫోటోని సోషల్ మీడియాలో షేర్ చేశారు. ౦ఐ తో ౫ఐ అంటూ ఫ్యాన్స్ ట్రెండ్ చేస్తున్నారు.ఈ ఏడాదిలో అంతకముందు రజినీ కాంత్ - కమల్ హాసన్ - అమీర్ ఖాన్ - శివ రాజ్ కుమార్ - పవన్ కళ్యాణ్ - రాజమౌళి - విజయ్ - ఎన్టీఆర్ - రామ్ చరణ్.. ఇలా ప్రతీ ఇండస్ట్రీలోని ప్రముఖులతో ఏదొక సందర్భంలో శివ కార్తికేయన్ వారితో కలిసి మాట్లాడారు. ఇది నిజంగా ప్రత్యేకమని చెప్పాలి. ఎలాంటి ఈగోలు లేకుండా అందరితో మంచి సంబంధాలు కొనసాగిస్తారు కాబట్టే ఇలాంటివి సాధ్యం అవుతాయి.ఇక డబ్బింగ్ సినిమాలతో శివ కార్తికేయన్ తెలుగులోనూ క్రేజ్ ఏర్పరచుకున్నాడు. 'రెమో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరో.. 'వరుణ్ డాక్టర్' 'కాలేజ్ డాన్' వంటి చిత్రాలతో మంచి విజయాలు అందుకున్నారు. ఇటీవల "ప్రిన్స్" అనే స్ట్రెయిట్ తెలుగు సినిమా కూడా చేశారు. త్వరలో 'మహావీరుడు' అనే చిత్రంతో పలకరించడానికి శివ రెడీ అవుతున్నారు.

# టీమిండియా చెత్త రికార్డు.. చరిత్రలో తొలిసారి ఇలా..!



ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో ఇవాళ (నవంబర్ 25) జరిగిన తొలి వన్డేలో ఘోర పరాజయాన్ని మూట గట్టుకున్న టీమిండియా.. ఓ చెత్త రికార్డును సైతం ఖాతాలో వేసుకుంది.చరిత్రలో ఎన్నడూ లేని విధంగా న్యూజిలాండ్ గడ్డపై వరుసగా 4 వన్డే మ్యాచ్‌ల్లో ఓడి అభాసుపాలైంది. 2020లో జరిగిన సిరీస్‌ను 0-3 తేడాతో కోల్పోయిన భారత జట్టు.. తాజా పరాజాయంతో కివీస్ గడ్డపై వరుసగా నాలుగో పరాజయాన్ని నమోదు చేసింది.గత పర్యటనలో తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో, రెండో వన్డేలో 22 పరుగుల తేడాతో, మూడో వన్డేలో 5 వికెట్ల తేడాతో ఓడిన భారత్.. 2022 పర్యటనలో భాగంగా ఇవాళ జరిగిన తొలి మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. న్యూజిలాండ్ గడ్డపై వన్డేల్లో చెత్త రికార్డు (25 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలిస్తే.. టీమిండియా 14 మ్యాచ్‌ల్లో మాత్రమే గెలిచింది) కలిగిన భారత్.. తాజా పరాజయంతో మరో అప్రతిష్టను మూటగట్టుకుంది. అయితే ఓవరాల్ హెడ్ టు హెడ్ రికార్డ్స్‌లో మాత్రం టీమిండియాదే పైచేయిగా ఉంది. ఇరు జట్ల మధ్య మొత్తం 106 మ్యాచ్‌లు జరగ్గా టీమిండియా 55, న్యూజిలాండ్ 50 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.ఇదిలా ఉంటే, ఇవాళ జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. శ్రేయస్ అయ్యర్ (80), శిఖర్ ధవన్ (72), శుభ్‌మన్ గిల్ (50) అర్ధసెంచరీలతో రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేయగా, 307 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన న్యూజిలాండ్ మరో 17 బంతులు మిగిలుండగానే ఆడుతూపాడుతూ విజయం సాధించింది. టామ్ లాథమ్ (104 బంతుల్లో 145; 19 ఫోర్లు, 5 సిక్సర్లు) అజేయ శతకంతో, కెప్టెన్ కేన్ విలియమ్సన్ (98 బంతుల్లో 94 నాటౌట్; 7 ఫోర్లు, సిక్స్) భారీ అర్ధశతకంతో జట్టును విజయతీరాలకు చేర్చారు. ఈ గెలుపుతో 3 మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

# తండ్రికి తగ్గ తనయుడు

వెస్టిండీస్ దిగ్గజ బ్యాటర్ శివ్‌నరైన్ చంద్రపాల్ కొడుకు టగెనరైన్ చంద్రపాల్.. తన తొలి అధికారిక విదేశీ పర్యటనలోనే సెంచరీ బాది అందరినీ ఆకట్టుకున్నాడు.ఆస్ట్రేలియా పర్యటన కోసం ఎంపిక చేసిన విండీస్ జట్టులో సభ్యుడిగా ఉన్న టగెనరైన్ చంద్రపాల్.. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ముందు ప్రైమ్ మినిస్టర్ ఎలెవెన్ జట్టుతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో ఓపెనర్‌గా వచ్చి, దాదాపు 90 ఓవర్ల పాటు క్రీజ్‌లో ఉండి 7వ వికెట్‌గా వెనుదిరిగాడు. ఈ ఇన్నింగ్స్‌లో 293 బంతులు ఎదుర్కొన్న టగెనరైన్.. 13 ఫోర్లు, సిక్సర్ సాయంతో 119 పరుగులు చేశాడు. టగెనరైన్ ఇన్నింగ్స్ తండ్రి శివ్‌నరైన్‌ను గుర్తు చేసిందని క్రికెట్ అభిమానులు చర్చించుకున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**